మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

| గురువారం THURSDAY 23-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 |
|---|---|---|---|
| | సంపుటి: 1 Volume:1 | సంచిక: 294 Issue: 294 | |

23 ఏప్రిల్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:58 సూర్యాస్తమయం - సా. 6:30 తిథి సప్తమి రా. 8:54 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం పునర్వసు రా. 8:59 వరకు తరువాత పుష్యమి యోగం సుకర్మ ఉ. 6:05 వరకు కరణం గరజి ఉ. 9:48 వరకు వనిజ రా. 8:54 వరకు వర్జ్యం ఉ. 9:35 నుండి ఉ. 11:06 వరకు దుర్ముహూర్తం ఉ. 10:09 నుండి ఉ. 10:59 వరకు మ. 3:09 నుండి మ. 3:59 వరకు రాహుకాలం మ. 1:48 నుండి మ. 3:22 వరకు యమగండం తె. 5:58 నుండి ఉ. 7:32 వరకు గుళికాకాలం ఉ. 9:06 నుండి ఉ. 10:40 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:22 నుండి తె. 5:10 వరకు అమృత ఘడియలు సా. 6:40 నుండి రా. 8:11 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:39 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## కాళేశ్వరమే ప్రాణేశ్వరం

హైకోర్టు తీర్పుతో కుట్రలు బహిర్గతం

రేవంత్ రెడ్డి డ్రామాలు తేటతెల్లం

మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజం

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థా నాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసా రి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తరువాయి 2 వ పేజీలో...



## సీబీఐ విచారణకు సిద్ధమా?

కాళేశ్వరంలో కమీషన్లు, కాంట్రాక్టుల లోపాలు

తీర్పుపై క్లీన్ చిట్ అంటూ తప్పుడు ప్రచారం

బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని పదే పదే చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు నిజంగా నిర్దోషులైతే, వెంటనే స్వయంగా సీబీఐ విచారణకు డిమాండ్ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. కాళేశ్వరం అంశంపై హైకోర్టు "క్లీన్ చీట్" ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తరువాయి 2 వ పేజీలో...



## అంతా డూప్ ఫైటింగ్

కాళేశ్వరంపై విచారణ చేతకాక కేంద్రంపై నెపం

మొత్తం ప్రాజెక్టుపై విచారణకు లేఖ రాయాలి

కాంగ్రెస్ సర్కారుకు ఎంపీ రఘునందన్ సవాల్

న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒప్పందాలు చేసుకుని డూప్ ఫైటింగ్ చేస్తున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. ఢిల్లీలో మీడియాలో మాట్లాడిన ఆయన, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. మూడు బ్యారేజీల మీద మాత్రమే కాకుండా, కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దీనిపై కేంద్రానికి లేఖ తరువాయి 2 వ పేజీలో...

tgsco

## ఆ అధికారం నేతన్నలకే!

టెస్కో నుంచే అన్ని ప్రభుత్వ సంస్థలకు వస్త్రాలు

ఎన్వోసీ లేకుండా టెండర్ వేయడం చట్టవిరుద్ధం

వరంగల్ చేనేత సంఘం పిటిషన్‌పై హైకోర్టు తీర్పు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): చేనేత కార్మికుల ప్రయోజనాలను కాపాడుతూ తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. రాష్ట్రంలోని గురుకులాలు సహా అన్ని ప్రభుత్వ సంస్థలు తమకు కావలసిన దుస్తులు, బెడ్‌షీట్లు, కార్పెట్లు -2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.15,475 |
| వెండి (గ్రాము): | రూ.275 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,214 |

# ఘోష్ చిట్టా.. చెత్త బుట్ట!






## నివేదిక ఆధారంగా చర్యలు వద్దు

ఆ కమిషన్ నిబంధనలు పాటించలేదు.. కాళేశ్వరం అవకతవకలపై హైకోర్టు తీర్పు

కేసీఆర్, హరీశ్, ఎస్కే జోషి, స్మితకు ఊరట.. కాంగ్రెస్ సర్కారుకు భారీ ఎదురుదెబ్బ



కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు మరో ఇద్దరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ కమిషన్ చట్టం కింద నిర్దేశించిన సరైన ప్రక్రియను ఘోష్ కమిషన్ పాటించలేదని ఊటంకించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావు, రిటైర్డ్ ఐఏఎస్, మాజీ సీఎస్ ఎస్కే జోషి, ఐఏఎస్ స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయలేదని, -2 వ పేజీలో...



## గేమ్ రూల్స్!

గేమింగ్ కంపెనీలకు నిబంధనలు.. ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఏర్పాటు

కేంద్రం కొత్త మార్గదర్శకాలు జారీ.. మే 1 నుంచి అమలుకు ఆదేశాలు

ఆన్‌లైన్ గేమింగ్ ఆడేవారి కోసం కేంద్ర ప్రభుత్వం కొన్ని కొత్త రూల్స్ తీసుకొచ్చింది. గేమ్స్ ఆడేవారికి మేలు కలిగేలా కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తాజాగా కొత్త రూల్స్‌పై మార్గదర్శకాలు విడుదల చేసింది. వచ్చే మే 1 నుంచి ఈ కొత్త రూల్స్ అమలుకాబోతున్నాయి. దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ చాలా పెద్దది. స్మార్ట్‌ఫోన్స్, ఇంటర్నెట్ డాటా తక్కువ ధరలో అందుబాటులో ఉండటం వంటి కారణాలతో చాలా మంది గేమింగ్‌వైపు మొగ్గు చూపుతున్నారు.

న్యూఢిల్లీ: దీనివల్ల కొందరు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. అయితే, ఇకపై గేమింగ్ విషయంలో కంపెనీలు కొన్ని రూల్స్ తప్పనిసరిగా ఫాలో కావాల్సిందే. సాధారణ, సోషల్ గేమ్స్‌కు సంబంధించి ఇకపై ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్స్ అవసరం లేదు. అయితే, అది ఈ-స్పోర్ట్స్ అయినా.. లేదా.. కేంద్ర ప్రభుత్వం ఏదైనా ప్రత్యేక గ్రూప్‌నకు సంబంధించిన గేమ్స్ అయినప్పుడు మాత్రం రిజిస్ట్రేషన్ అవసరం. ఈ నిర్ణయం మొబైల్ గేమింగ్ స్టార్టప్స్‌కు, చిన్న డెవలపర్లకు మేలు చేస్తుంది. ఎక్కువ డాక్యుమెంట్లు వంటివి అవసరం లేకుండానే తమ గేమ్స్‌ను మార్కెట్లోకి తీసుకురావొచ్చు. మనీ సంబంధిత గేమ్స్, ఎక్కువ మంది కలిసి ఆడే గేమ్స్, హై రిస్క్ ఉన్న టైటిల్స్, అన్ని రకాల ఈ స్పోర్ట్ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. ఇప్పటికి ప్రత్యేక కేటగిరీ అంటూ లేదు. కానీ, త్వరలోనే వీటిని కేటగిరిలుగా విభజిస్తారు. కొత్త రూల్స్ ప్లేయర్స్‌కు మరింత మేలు చేస్తాయి. వారికి మరింత భద్రత కల్పిస్తాయి. ఆటగాళ్ల తరువాయి 2 వ పేజీలో...

## ఆర్టీసీ సమ్మె వెనుక హరీశ్

### జేఏసీ నేతలకు ఎవరో ఫోన్ చేశారు

చర్చలు జరుతుండగానే వెళ్లిపోయారు.. పొన్నం విమర్శలు



హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మె వెనుక బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు హస్తం ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అధికారులతో చర్చలు జరుగుతున్న సమయంలోనే జేఏసీ నేతలు ఎవరో ఫోన్ చేయగానే బయటకు వెళ్లిపోవడం కుట్రలో భాగమని విమర్శించారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి రాష్ట్రంలో లేనందున వచ్చాక హామీలపై స్పష్టత ఇస్తామని, సమ్మె విరమించాలని కోరినా జేఏసీ నేతలు పట్టించుకోలేదన్నారు. హరీశ్ రావు ఆర్టీసీ సమ్మెపై మాట్లాడిన మాటలు చూస్తే.. సమ్మె వెనుక ఆయన ప్రమేయం ఉందన్న అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. గతంలో ఆర్టీసీ తరువాయి 2 వ పేజీలో...




## బస్సు బందీ!

### డిపోల గేటు దాటని చక్రాలు

రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సమ్మె.. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

అధికారుల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు.. కరీంనగర్‌లో బస్సు ప్రమాదం


(ఈవార్తలు-న్యూస్ నెట్‌వర్క్)

తెలంగాణ వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సులు అర్ధరాత్రి నుంచి నిలిచిపోయాయి. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ సమ్మెకు పిలుపునిచ్చింది. ప్రభుత్వంతో మంగళవారం జరిపిన చర్చలు విఫలం కావడంతో ముందుగా ప్రకటించినట్లుగానే కార్మికులు సమ్మె బాట తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



బ్రిటన్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ తరాలను 'పొగాకు రహితంగా'మార్చే చారిత్రక బిల్లుకు యూకే పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. జనవరి 1, 2009 తర్వాత జన్మించిన ఎవరైనా సరే.. తమ జీవితకాలంలో ఇకపై చట్టబద్ధంగా సిగరెట్ కొనుగోలు చేయడానికి వీల్లేకుండా ఈ కఠినమైన చట్టాన్ని అధికారికంగా తీసుకొచ్చింది.



## నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

హైదరాబాద్‌ల ఓ హాస్పిటల్‌లో తుదిశ్వాస

నేడు సాయంత్రం అంత్యక్రియలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడిన ఆయనకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నెల రోజులపాటు చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తుదిశ్వాస విడిచారు. భాస్కరరావు మరణం పట్ల తెలుగు రాష్ట్రాల - 2 వ పేజీలో...



## నేడే తమిళనాడు, బెంగాల్-1 పోలింగ్

### ఎన్నికలకు సర్వం సిద్ధం: ఈసీ

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. పశ్చిమ బెంగాల్ మొదటి దశ ఎన్నికల (152 స్థానాలకు)తో పాటు తమిళనాడులోని మొత్తం 234 సీట్లకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. వీటి ఫలితాలు మే4న వెల్లడవుతాయి. పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశ పోలింగ్‌లో 16 జిల్లాల్లోని 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటింగ్ జరుగుతుంది. మొదటి దశలో 8,000కి పైగా పోలింగ్ కేంద్రాలను అత్యంత సున్నిత ప్రాంతాల్లో - 2 వ పేజీలో...

## డీజీపీలుగా మహేశ్ భగవత్, సజ్జనార్

ఆరుగురు ఐపీఎస్‌లకు ప్రమోషన్

పోలీస్ శాఖలో భారీ పదోన్నతులు



2

# రాశి ఫలాలు

23.4.2026

మేషం: చేపట్టిన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. దైవ చింతన పెరుగుతుంది. బంధు మిత్రులతో గృహమున సందడిగా గడుపుతారు. ఇంటా బయట కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగ విషయమై అధికారులతో చర్చలు ఫలిస్తాయి.

వృషభం: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వ్యాపార వ్యవహారాలలో స్వంత ఆలోచనతో ముందుకు సాగడం మంచిది. చేపట్టిన పనులు వాయిదా వేయడం మంచిది. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఉద్యోగమున పనిభారం తప్పదు. విద్యార్థుల శ్రమకు తగిన ఫలితం కనిపించదు.

మిథునం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. సన్నిహితుల నుండి ఊహించని ధన సహాయం అందుతుంది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు కలసివస్తాయి. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి.

కర్కాటకం: ఆర్థికంగా కొంత పురోగతి కలుగుతుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చేపట్టిన వ్యవహారాలు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఇంటా బయట అనుకూల పరిస్థితులు ఉంటాయి. వ్యాపారమున ఆశించిన అభివృద్ధి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి.

సింహం: ఆదాయం విషయంలో నిరాశ తప్పదు. ఉద్యోగమున చిన్నపాటి వివాదాలుంటాయి. వృత్తి వ్యాపారములలో కొత్త సమస్యలు ఎదురవుతాయి. చేపట్టిన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. దూర ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: నూతన ఋణ ప్రయత్నాలు కొంతవరకు కలిసివస్తాయి. వృత్తి ఉద్యోగాలలో ఆకస్మికంగా స్థానచలనాలుంటాయి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అధిగమించి ముందుకు సాగుతారు. బంధు వర్గం వారితో మాటపట్టింపులుంటాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు.

తుల: కుటుంబ సభ్యుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. పాతమిత్రుల కలయిక సంతోషం కలిగిస్తుంది. సమాజంలో ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

వృశ్చికం: ఆప్తులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. నూతన వస్త్రాభరణాలను కొనుగోలు చేస్తారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన ఆలోచనలను కార్యరూపం దాల్చుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుతాయి. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

ధనస్సు: మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో ఊహించని కలహాలు కలుగుతాయి. దూర ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి,వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధికమవుతాయి.

మకరం: ఆప్తుల నుండి అందిన సమాచారం కొంత మానసికంగా బాధిస్తుంది. దూర ప్రయాణాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. వృత్తి వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగ విషయంలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

కుంభం: ఆప్తులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. భూ సంబంధిత క్రయవిక్రయాలలో ఊహించని లాభాలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశించిన విధంగా ఉంటుంది. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమౌతుంది.

మీనం: చుట్టు పక్కల వారితో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. పరిస్థితులు వ్యతిరేకంగా ఉంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ విషయంలో తొందరపాటు నిర్ణయాలు చేసి నష్టపడతారు.



# కాళేశ్వరమే ప్రాణేశ్వరం

మొదటి పేజీ తరువాయి

తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది.

దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# ఘోష్ చిట్టా..చెత్త బుట్ట!

మొదటి పేజీ తరువాయి

తమ వాదనలు వినకుండానే కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, విచారణ కమిషన్ ఓను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలు తీసుకోవడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన నివేదికను 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు కేసీఆర్, హరీశ్ రావు సహా అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికలో పేర్కొంది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫు అడ్వొకేట్ జనరల్ ఏ సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరఫున సీనియర్ కౌన్సిల్ ఎస్ నిరంజన్ రెడ్డి వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నలుగురు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు ప్రారంభించవద్దని పేర్కొంది.

# ఆ అధికారం నేతన్నలకే!

మొదటి పేజీ తరువాయి

వంటి వస్త్రాలను కచ్చితంగా టెస్కో (తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్) ద్వారానే సేకరించాలని స్పష్టం చేసింది. గురుకుల పాఠశాలలకు కార్పెట్లు, బ్లాంకెట్లు, దుస్తుల సరఫరా కోసం ఈ నెల 2న ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. గురుకుల విద్యార్థులకు కావాల్సిన బట్టలను సరఫరా చేసే పనిని ప్రభుత్వం ఒక ప్రైవేటు టెండర్ ద్వారా వేరే వాళ్లకు ఇవ్వాలని నిర్ణయించింది. దీనికోసం ఈనెల 2న నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే, వరంగల్ జిల్లా కొత్వాడలోని వీరాంజనేయ చేనేత సహకార సంఘం దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. నిబంధనల ప్రకారం.. ఈ పని చేనేత కార్మికులకే (టెస్కో ద్వారా) ఇవ్వాలని.. కానీ ప్రభుత్వం బయట వ్యక్తులకు ఇచ్చిందని, దాన్ని రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. చేనేత సంఘం తరపు అడ్వకేట్ వాదిస్తూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవో 1 ప్రకారం వస్త్రాలన్నీ టెస్కో నుంచే కొనాలని, కానీ అధికారులు నిబంధనలు అతిక్రమించి ప్రైవేటు టెండర్లు పిలిచి నేతన్నలకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. తమ దగ్గర సరకు లేదని టెస్కో సంస్థ ధ్రువీకరణ పత్రం (ఎన్వోసీ) ఇవ్వకుండానే.. అధికారులు నేరుగా బయట మార్కెట్‌లో టెండర్లు పిలవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం వాదిస్తూ.. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్నందున సమయాభావం వల్లే టెండర్లు పిలిచామని, నాణ్యత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని సమర్థించుకుంది. ఇరుపక్షాల వాదనలపై న్యాయమూర్తి.. జీవో 1 చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన రక్షణ కవచమని వ్యాఖ్యానించారు. టెస్కో లేఖ లేకుండా ప్రైవేటు టెండర్లు పిలవడం చెల్లదని స్పష్టం చేస్తూ నోటిఫికేషన్‌ను రద్దు చేశారు.

# నేడే తమిళనాడు, బెంగాల్-1 పోలింగ్

మొదటి పేజీ తరువాయి

ఉన్నట్లు గుర్తించారు. ఓటింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. భారీ ఓటింగ్ శాతం నమోదవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జనసాంద్రత ఎక్కువ ఉండే ప్రాంతాల్లో క్యూలు భారీగా ఉండకుండా ఓటర్లు ముందుగానే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అధికారిక సమాచారం ప్రకారం మొత్తం 3,60,77,171 ఓటర్లు ఈ దశలో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. వీరిలో మంది 1,84,99,496 పురుషులు, 1,75,77,210 మంది మహిళలు, 465 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. మొదటి దశలో పోలింగ్ జరిగే ప్రాంతాలు: మొదటి దశలో ఉత్తర బెంగాల్ జిల్లాలు డార్జిలింగ్, జల్పాయిగురి, కూచ్ బేహార్ ప్రాంతాలు, అలాగే జంగల్ మహల్, పురులియా, బాంకురా, పశ్చిమ మేదినిపూర్, బీర్భూమ్, ముర్షిదాబాద్ భాగాలు ఉన్నాయి. ఓటర్ ఐడీ లేకపోయినా ఓటు వేయవచ్చు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకెళ్లి వేయాలి.

## నాదెండ్ల భాస్కరరావు

# కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు గురువారం సాయంత్రం పంజాగుట్ట వైకుంఠధామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడు నాదెండ్ల భాస్కర్ ప్రస్తుతం ఏపీ కేబినెట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారు. 1935 జూన్ 23న గుంటూరులో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. ఆయన వృత్తి రీత్యా లాయర్ కాగా.. కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. నాదెండ్ల భాస్కరరావు 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. అనంతరం అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. నాదెండ్ల భాస్కరరావు కాంగ్రెస్ పార్టీని వీడి 1982లో ఎన్టీ రామారావు వెంట నడిచారు.. తెలుగుదేశం పార్టీ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. అప్పట్లో ఆయన ఎన్టీఆర్‌కు కుడి భుజంలా ఉండేవారు. 1983లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగా.. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. నాదెండ్ల భాస్కరరావు ఎన్టీఆర్ కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. అయితే 1984లో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చికిత్స కోసం అమెరికా వెళ్ళిన సమయంలో ఒక్కసారిగా రాజకీయ పరిణామాలు మారిపోయాయి. కొంతమంది ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకున్న నాదెండ్ల భాస్కర రావు 1984 ఆగస్టు 16న సీఎంగా ప్రమాణం చేశారు. అప్పటి గవర్నర్ దీనికి సహకరించారు. అయితే నెల రోజుల తర్వాత మళ్లీ పరిణామాలు మారిపోవడం, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకోలేకపోవడంతో.. నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. దీన్నే ఆగస్టు సంక్షోభం అంటారు. నాదెండ్ల భాస్కరరావు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి.. 1989 ఎన్నికల్లో తెనాలి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. అయితే ఆయన 1994 ఎన్నికల్లో మళ్లీ తెనాలి నుంచి పోటీచేసినా ఓటమి పాలయ్యారు. 1

# బస్సు బందీ!

మొదటి పేజీ తరువాయి

పట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలలో బస్సులు బయటకు రాకుండా నిలిచిపోయాయి. ఫలితంగా బుధవారం ఉదయం నుంచే కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన 32 హామీలను తక్షణమే అమలు చేయాలని కార్మికులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. హామీలు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని డిపోల వద్ద కార్మికులు బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌ను కూడా బలంగా వినిపించారు. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్ సహా అన్ని జిల్లాల్లోనూ సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఆదిలాబాద్ రీజియన్‌లో 641 బస్సులు ఆగిపోగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పది డిపోలకు చెందిన 850 బస్సులు నిలిచిపోయాయి. వేల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. బస్టాండ్‌ల వద్ద ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. పరిస్థితిని గమనించిన అధికారులు, ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కొన్నిచోట్ల అద్దె బస్సులను నడిపించారు.

### లారీని ఢీకొట్టిన బస్సు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అధికారులు ప్రైవేటు డ్రైవర్లను రంగంలోకి దించారు. కరీంనగర్-2 డిపోకు చెందిన బస్సులో ప్రయాణికులను ఎక్కించి, ఒక ప్రైవేటు డ్రైవర్ సహాయంతో వరంగల్‌కు పంపారు. అయితే, అల్గునూర్ వద్దకు రాగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా హాహాకారాలు చేశారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గాయపడ్డ వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

### పురుషులకూ ఉచిత బస్సు ప్రయాణం

కరీంనగర్ డిపోలో టికెట్లు ఇచ్చేవారు లేక పురుషులు కూడా ఉచితంగా ప్రయాణించారు. సాధారణంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం కింద కేవలం మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంది. కానీ.. ప్రస్తుత సమ్మె కారణంగా కరీంనగర్ డిపో నుంచి

## సీబీఐ విచారణకు

# సిద్ధమా?

మొదటి పేజీ తరువాయి

మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తీవ్రంగా మండిపడ్డారు. నిజంగా ఎలాంటి అవకతవకలు జరగలేదంటే, స్వతంత్ర సంస్థ ద్వారా విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని పొంగులేటి డిమాండ్ చేశారు. విచారణ జరిగితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే బీఆర్ఎస్ నాయకత్వం వెనుకడుగు వేస్తోందని ఆరోపించారు. భారీ ఆర్థిక దోపిడీ, కమీషన్ల వ్యవహారం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బహిర్గతమవుతాయనే భయమే వారిని వెంటాడుతోందని మంత్రి అన్నారు. ఇదే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని, విచారణను తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యత దెబ్బతిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై లెక్క చెప్పాల్సిన రోజు దగ్గరలోనే ఉందని, ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.ం

# గేమ్ రూల్స్!

మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదులకు కంపెనీలు ప్రాధాన్యమివ్వాలి. అలాగే, సైబర్ సెక్యూరిటీ, సేఫ్ పేమెంట్ మానిటరింగ్, రెగ్యులర్ రిపోర్టింగ్ వంటి వాటికి అవకాశం ఇవ్వాలి. ఈ రూల్స్ వల్ల మొబైల్ ఫోన్లలో గేమ్స్ ఆడే వారు మరింత సులభంగా, భద్రంగా గేమ్స్ ఆడుకోవచ్చు. ఇక, ఈ గేమ్స్, నిబంధనల్ని పర్యవేక్షించేందుకు కేంద్రం తాజాగా ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీని కూడా ఏర్పాటు చేసింది. ఇందులో ఫైనాన్స్, బ్రాడ్‌కాస్టింగ్, హెల్త్, స్పోర్ట్స్, పవర్, జస్టిస్, విదేశీ వ్యవహారాల శాఖలకు చెందిన ప్రతినిధులు ఉంటారు. వీరు.. ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల రిజిస్ట్రేషన్స్, ఫిర్యాదులు, భద్రత వంటి అంశాల్ని పర్యవేక్షిస్తారు.

# అంతా డూప్ ఫైటింగ్

మొదటి పేజీ తరువాయి

రాస్తే, విచారణకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తే కాళేశ్వరం అవినీతి సొమ్ము కక్కిస్తామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వాగ్దానాలు చేశారని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంతో విచారణ చేతకాక కేంద్రంపై నెపం నెడుతున్నారని మండిపడ్డారు. పీసీ ఘోష్ కమిషన్ పేరుతో రెండేళ్ల పాటు కేవలం సమయాన్ని వృథా చేశారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మించిన సంస్థకే మళ్లీ మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును కట్టబెట్టడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. గత రెండున్నరేళ్లుగా కేసీఆర్ కుటుంబ సభ్యులపై రేవంత్ రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వారిద్దరూ వేర్వేరు కాదని విమర్శించారు. పేరు మార్చుకుంటానని ప్రగల్భాలు పలకడం మానేసి, చేతల్లో చూపించాలని రేవంత్ రెడ్డికి రఘునందన్ రావు సవాల్ విసిరారు.

## ఆర్టీసీ సమ్మె వెనుక హరీశ్

మొదటి పేజీ తరువాయి

సమ్మెను దారుణంగా అణిచివేసిన బీఆర్ఎస్ నేతల మాటలను కార్మికులు పట్టించుకోవద్దని, ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పట్ల సానుకూలంగా ఉందని పునరుద్ఘాటించారు. తమ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల కోసం అనేక చర్యలు తీసుకుందని వివరించారు. 32అంశాల్లో పీఆర్సీ, యూనియన్లు, విలీనం మినహా అన్ని 29 డిమాండ్లకు ఒప్పుకున్నామని, విలీనంపై సాంకేతిక అంశాలను పరిష్కరించి నాలుగు వారాల్లో అన్నింటిని పరిష్కరిస్తామని చెప్పిన సమ్మెకు వెళ్లడం బాధకరం అని పొన్నం పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం విజయవంతం కావడం నచ్చకే ప్రతిపక్షాలు కుట్రతో కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఆర్టీసీపై కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పేద ప్రజలకు లైఫ్ లైన్‌గా ఉన్న ఆర్టీసీని దెబ్బతీయవద్దని కార్మికులను కోరుతున్నామన్నారు.

## డీజీపీలుగా మహేశ్ భగవత్, సజ్జనార్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): రాష్ట్ర పోలీస్ శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. 1995, 1996 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హోదా కల్పిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం విడుదల చేసిన జీవో నంబర్ 509 ప్రకారం, వీరికి 'అబవ్ సూపర్ టైమ్ స్కేల్ (2)' గ్రేడ్‌లో పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు వెలువరించారు. పదోన్నతి పొందిన అధికారులలో 1995 బ్యాచ్‌కు చెందిన వీరిశెట్టి వెంకట శ్రీనివాసరావు, స్వాతి లక్రా, మహేశ్ మురళీధర్ భగవత్ ఉండగా, 1996 బ్యాచ్ నుండి చారు సిన్హా, డాక్టర్ అనిల్ కుమార్ , వీసీ సజ్జనార్ ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వీరంతా ఇకపై డీజీపీ స్థాయి హోదాలో తమ సేవలను అందించనున్నారు. అయితే, ప్రస్తుతానికి వీరిని వారు నిర్వహిస్తున్న పాత పోస్టుల్లోనే కొనసాగిస్తూ (ఇన్-సిటు) ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అంటే బాధ్యతలలో మార్పు లేకుండానే వారి హోదా, వేతన శ్రేణిని పే మ్యాట్రిక్స్ లెవల్ 16కు పెంచిందన్నమాట.

# కాళేశ్వరం కూలింది నిజం

## ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు.. హైకోర్టు తీర్పుపై మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ ఈరోజు (బుధవారం) భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ -6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని, అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన




లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు.

**కళ్లముందే కాళేశ్వరం కుంగిపోయింది**

కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎస్ఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన తమ ప్రభుత్వం ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు తీర్పుతో సీబీఐ విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తీర్పు కాపీ వచ్చాక ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఆ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు అందలేదని చెప్పుకొచ్చారు. ప్రతి ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలు భరిస్తుందని అన్నారు. కేవలం రెండు ఫిల్లర్లు కాదని.. మొత్తం పౌండేషన్.. మొత్తం మూడు బ్యారేజీల పునాదులు అనుమానాస్పదంగా ఉన్నాయని.. ఇప్పటికే దేశంలో పేరొందిన సంస్థల నిపుణులందరూ అభిప్రాయపడ్డారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మానవ తప్పిదమని చెప్పుకొచ్చారు. దేశంలోనే ఇది అతి పెద్ద విధ్వంసమన్నారు. అమూల్యమైన ప్రజాధనం వృథా అయిందని.. దీనికి బాధ్యులెవరో ప్రజల ముందు నిలబెట్టాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## సమ్మె పరిష్కారం కాదు.. విధుల్లో చేరండి

ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి



హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని, ప్రజా సంస్థను కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మె ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ పరిశీలన చేస్తోందని, నాలుగు వారాల్లో నివేదిక వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్థను, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు సమ్మెను విరమించుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని, ఇది కాలయాపన చేసే వ్యూహం కాదని స్పష్టం చేశారు. ఉద్యోగులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలపై ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని, వాటిని వెంటనే పరిష్కరించవచ్చని తెలిపారు. మిగిలిన ఆర్టీసీ విలీనం, యూనియన్ల గుర్తింపు వంటి అంశాలు సాంకేతిక పరమైనవని, వీటిపై లోతైన పరిశీలన అవసరమని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీతో పాటు బకాయిపడ్డ డీఏలను, 2013 నాటి బాండ్లను సైతం పరిష్కరించినట్లు తెలిపారు. రూ.1,205 కోట్లుగా ఉన్న పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు, రూ.690 కోట్లుగా ఉన్న సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామన్నారు. పీఎఫ్, సీసీఎస్ కోసం ప్రతినెలా రూ.75 కోట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. పని భారం తగ్గించేందుకు త్వరలోనే 4,538 మంది ఉద్యోగుల నియామకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 1,134 కారుణ్య నియామకాలు చేపట్టామని, గతంలో తొలగించిన 250 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రస్తుతం కోలుకుంటోందని, ఈ దశలో సమ్మె చేయడం సంస్థకు, ప్రజలకు నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీపై ఆధారపడి ఉన్నారని, వీరిలో 45 లక్షల మంది మహిళలేనని గుర్తుచేశారు. పేద ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను భరించలేరని, కాబట్టి ప్రజా రవాణాకు ఆటంకం కలిగించకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, వారికి అండగా ఉంటుందని భరోసా ఇస్తూ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెంటనే విధుల్లో చేరాలని కోరారు.

## కూలింది కుట్రలు

**పీసీ ఘోష్ నివేదిక పీసీసీ నివేదికే హైకోర్టు తీర్పుపై కేటీఆర్ వ్యాఖ్యలు**



హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల కేసులో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పుతో తెలంగాణ ప్రజలు, రైతులు గెలిచారని.. రాజకీయ రాబందులు, పిట్టల దొరల కుట్రలు గోదావరి ప్రవాహంలో కొట్టుకుపోయాయని ఆయన ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు. హైకోర్టు తీర్పుతో కూలింది కాళేశ్వరం కాదు.. ఆ ప్రాజెక్టుపై కాంగ్రెస్ పన్నిన కుట్రలు కూలిపోయాయి అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం పెరిగిందని, నిజాన్ని ఎవరూ దాచలేరని ఈ తీర్పుతో స్పష్టమైందని అన్నారు. ఇది జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదు.. 'పీసీసీ' (కాంగ్రెస్) నివేదిక అని తాము అప్పుడే చెప్పామని గుర్తు చేశారు. మేడిగడ్డ కుంగడం వెనుక పెను కుట్ర దాగి ఉందని, అది కచ్చితంగా కాంగ్రెస్ పనే అయి ఉంటుందని కేటీఆర్ ఆరోపించారు. మేడిగడ్డలో అసలు ఏం జరిగిందో తెలియాలంటే విశ్రాంత జడ్జితో నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నేలపై గోదావరి జలాలు పారినన్ని రోజులు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపేయలేరని, ఇవాళ రాష్ట్రంలో పారుతున్న ప్రతి నీటి బొట్టుకు కారణం కేసీఆరేనని కొనియాడారు. రూ.94 వేల కోట్లతో ప్రాజెక్టు కడితే.. రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ కాంగ్రెస్, బీజేపీలు సిగ్గువిడిచి విష ప్రచారం చేశాయని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీపై పెట్టిన ఖర్చు కేవలం రూ.3,800 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. మేడిగడ్డ అంటే కుంగిన గడ్డ కాదు.. అది తెలంగాణకు 'మేటి గడ్డ', 'నీటి గడ్డ' అని ఆయన అభివర్ణించారు. భూమి ఉన్నంత వరకు కాళేశ్వరం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చెక్ డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీలు చేతులు కలిపి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. తప్పుడు పని చేసిన వారు ఎవరైనా ఊరుకునేది లేదని హైకోర్టు తీర్పుతో తేలిపోయిందని ఆయన అన్నారు.

## ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకా?

### మాజీమంత్రి తలసాని ఆగ్రహం



సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): తెలంగాణలో ఆర్టీసీ సమ్మె ప్రారంభమయింది. బస్సులు ఎక్కడికక్కడ డిపోలకే పరిమితమయ్యాయి. ఆర్టీసీ సమ్మె కారణంగా సాధారణ ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన మండిపడ్డారు. కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లను ఎందుకు నియమిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అనుభవం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులనే ఆ బస్సులకు కేటాయించాలని, తద్వారా వారి ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీకి చెందిన విలువైన డిపోలు, ఆస్తులను ప్రైవేట్ సంస్థలపరం చేయడం ఏంటని నిలదీశారు. ఇది సంస్థను నిర్వీర్యం చేయడమేనని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి, ఇప్పుడు సమ్మె వల్ల వారిని ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. పేదలు, విద్యార్థులు, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని అన్నారు.

## యజమాని కూతురితో లవ్ ట్రాక్

**నమ్మి కిలో బంగారం ఇచ్చిన యువతి**

**పోలీసుల విచారణలో వెలుగులోకి మోసం**

**నిందితుడి అరెస్ట్.. 20 తులాల బంగారం రికవరీ**

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): నమ్మకంగా పనిచేస్తున్నాడనుకున్న వ్యక్తే యజమాని కుటుంబానికి తీరని ద్రోహం చేశాడు. ప్రేమ పేరుతో యజమాని కుమార్తెను వంచించి, ఆమె నుంచి ఏకంగా కిలో బంగారు ఆభరణాలను కాజేశాడు. బ్రెయిన్ ట్యూమర్ అంటూ నాటకమాడి ఈ భారీ మోసానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి చైతన్యపురిలో టైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన వద్ద 34 ఏళ్ల సాగర్ గత నాలుగేళ్లుగా మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. నమ్మకంగా ఉంటూ యజమాని కుటుంబంతో కలిసిపోయాడు. ఈ క్రమంలోనే యజమాని కుమార్తెతో పరిచయం పెంచుకుని, ఆమెను ప్రేమ పేరుతో తనవైపు తిప్పుకున్నాడు. సాగర్‌కు అప్పటికే పెళ్లయ్యి ఒక పాప కూడా ఉండటం.. ఇంట్లో ఒకడిలా చూసుకుంటుండటంతో యజమానికి అతడి ప్రవర్తన పట్ల అనుమానం రాలేదు. కొంతకాలం తర్వాత తన పథకాన్ని అమలు చేయడం మొదలుపెట్టాడు. తనకు బ్రెయిన్ ట్యూమర్ ఉందని, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానంటూ ఆమె ముందు కన్నీటిపర్యంతమయ్యాడు. అతని మాటలను పూర్తిగా నమ్మిన ఆ యువతి, ప్రియుడిని కాపాడుకోవాలని నిర్ణయించుకుంది.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 | Email: contact@evarthalu.com



మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## ప్రకాశ్‌రాజ్‌ను చంపినే ఏ1గా ఉంటా

**ఆయన ఒక అర్బన్ నక్సలైట్**

**బీజేపీ నేత వనిపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు**

రంగారెడ్డి, ఏప్రిల్ 22 (ఈవార్తలు): నటుడు ప్రకాశ్ రాజ్‌పై రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రకాశ్ రాజ్‌ను ఎవరైనా హత్య చేస్తే, ఆ కేసుకు తానే ఏ1 ముద్దాయిగా ఉంటానని, పూర్తి బాధ్యత తనదేనని శ్రీనివాస్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. శ్రీరాముడిపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఆయన ఈ వివాదాస్పద హెచ్చరికలు జారీ చేశారు. రామాయణం, శ్రీరాముడిపై ప్రకాశ్ రాజ్ ఇటీవల చేసిన వ్యంగ్యాస్త్రాలే ఈ వివాదానికి దారితీశాయి. ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన రాముడు, లక్ష్మణుడు అడవిలో పండ్లు తింటే జీఎస్టీ కట్టాలా అని, 'వన్ నేషన్ వన్ రిలీజియన్' అంటూ ప్రకాష్ రాజ్ ఎగతాళి చేశారని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోదీని విమర్శించే క్రమంలో హిందూ దేవుళ్లను అవమానించడం సహించరాని నేరమని ఆయన పేర్కొన్నారు. నాస్తికుడినని చెప్పుకునే ప్రకాశ్ రాజ్, కేవలం హిందూ మతాన్ని, సనాతన ధర్మాన్ని మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్‌ను 'అర్బన్ నక్సలైట్' అని, 'తుకుడే గ్యాంగ్' సభ్యుడని శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా అభివర్ణించారు. ఢిల్లీలోని జేఎన్‌యూలో దేశ వ్యతిరేక నినాదాలు చేసిన వారికి, బీఫ్ ఫెస్టివల్స్ నిర్వహించిన వారికి ప్రకాశ్ రాజ్ మద్దతు పలికిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దక్షిణ భారతీయుడినని చెప్పుకుంటూనే శ్రీరాముడిపై జోకులు వేయడం ప్రకాశ్ రాజ్ పైశాచిక ఆనందానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇంతటితో ఆగకుండా ప్రకాశ్ రాజ్ షూటింగ్ ఎక్కడ జరిగినా అడ్డుకుంటామని శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఆయన టూర్ డైరీని అనుసరిస్తామని, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే వెంటాడి, వేటాడతామని వార్నింగ్ ఇచ్చారు. చిత్ర పరిశ్రమలోని అగ్ర హీరోలు, నిర్మాతలు స్పందించి ప్రకాశ్ రాజ్‌ను సినిమాల నుంచి పూర్తిగా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇది నయా భారత్ అని, ఇక్కడ హిందూ ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌లో అజ్ఞాత వ్యక్తులు చేస్తున్న ఆపరేషన్లను గుర్తుపెట్టుకోవాలని పరోక్షంగా హెచ్చరించడం ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. తనపై వస్తున్న విమర్శలపై ప్రకాశ్ రాజ్ గతంలో స్పందించినప్పటికీ, తాజా వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత ముదిరినట్టయింది.

## రైజింగ్ ఎంవోయూల సంగతేంది?

**అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**

**ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచన**

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ రెండు సదస్సుల్లో జరిగిన ఎంవోయూలపై ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ అంశాలు, ఫ్యూచర్ సిటీ, ఇతర ప్రాంతాల్లో సంస్థలకు కేటాయించాల్సిన భూమి వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని డేటా సెంటర్లు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.


# తెలంగాణలో సమృద్ధిగా ఎల్పీజీ

## పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదు.. ఆయిల్ కంపెనీల స్పష్టీకరణ




హైదరాబాద్, ఏప్రిల్ 22 (పీఐబీ): తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సరఫరా ప్రస్తుత అవసరాలకు సరిపడే స్థాయిలో ఉందని, ఎక్కడా కొరత లేదని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు స్పష్టం చేశాయి. సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, లాజిస్టిక్స్‌ను మెరుగుపరచడానికి, డెలివరీలను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ఈ నెల మొదటి 20 రోజుల్లో పెట్రోల్, డీజిల్ సరఫరాలో సుమారు 7% వృద్ధి నమోదైందని వెల్లడించాయి. ఇదే సమయంలో గృహ అవసరాల కోసం ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్‌లు తగ్గినట్లు గమనించామని, ఇది వినియోగదారుల్లో ఎలాంటి భయాందోళనలు లేవని సూచిస్తున్నదన్నారు. ఈ నెలలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 37.77 లక్షల గృహ ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేసినట్లు వివరించాయి. అటు.. వాణిజ్య ఎల్పీజీ సరఫరా కోసం ప్రత్యేక పోర్టల్స్‌ను కూడా అన్ని ఓఎంసీలు ప్రారంభించాయి. వ్యాపార సంస్థలు తమ అవసరాలను ఈ పోర్టల్స్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించాయి. మరోవైపు, పైప్ నేచురల్ గ్యాస్ వినియోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని, ప్రస్తుతం రాష్ట్రంలో 1.03 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లు ఉన్నాయని తెలిపాయి. హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, చౌటుప్పల్, నల్లగొండ, వరంగల్, ఖమ్మం, షాద్‌నగర్, రామగుండం వంటి ప్రాంతాల్లో పీఎన్‌జీ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించాయి. ఆసక్తి ఉన్నవారు భాగ్యనగర్ గ్యాస్, టోరెంట్ గ్యాస్, మేఘ గ్యాస్ వంటి గ్యాస్ కంపెనీలను సంప్రదించాలని సూచించాయి. స్థానిక చిరునామా లేని వలస కార్మికులు, విద్యార్థుల కోసం 5 కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, హైదరాబాద్‌లో 5 కిలోల కొత్త కనెక్షన్ ధర రూ.1,547, రీఫిల్ ధర రూ.673గా ఉందని వివరించాయి. కాగా, అక్రమంగా నిల్వ, రవాణా జరుగుతున్న ఎల్పీజీపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు 1,942 దాడులు నిర్వహించి 5,388 సిలిండర్లను స్వాధీనం చేసుకుంది.

# ఏపీ రాజ్యసభ రేసులో అన్నామలై!



విజయవాడ, ఏప్రిల్ 22 (ఈవార్తలు): ఏపీ రాజకీయాల్లో రాజ్యసభ ఎన్నికల వేడి మొదలైంది. కూటమిలో సీట్ల పంపకాలపై చర్చలు జరుగుతుండగా, బీజేపీ కోటాలో తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. తమిళనాడు రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్న అన్నామలైని ఏపీ నుంచి పెద్దల సభకు పంపేందుకు బీజేపీ అధిష్ఠానం తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏపీలో జూన్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమికి ఈ నాలుగు స్థానాలను దక్కించుకునే సంఖ్యాబలం ఉంది. పొత్తులో భాగంగా చేసుకున్న ఒప్పందం ప్రకారం టీడీపీకి రెండు, జనసేన, బీజేపీలకు చెరొక స్థానం కేటాయించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు డి.మాధవ్ మధ్య ఈ విషయంపై చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీకి దక్కే ఒక్క స్థానాన్ని అన్నామలైకి కేటాయించాలని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న ఆయనకు, ఈ రూపంలో జాతీయ స్థాయిలో కీలక పదవి ఇవ్వాలని బీజేపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి గతంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామా చేసినప్పుడు కూడా ఏపీ కోటాలో అన్నామలై పేరు వినిపించింది. కానీ, అప్పుడు ఏపీకే చెందిన బీజేపీ నేత పాక వెంకట సత్యనారాయణకు అవకాశం దక్కింది. దీంతో ఈసారైనా ఆయనకు అవకాశం దక్కుతుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు జనసేన పార్టీ నుంచి కూడా తొలిసారిగా ఒకరు పెద్దల సభలో అడుగుపెట్టనున్నారు. ఆ పార్టీ తరఫున పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు బలంగా వినిపిస్తోంది. ఇక, టీడీపీకి కేటాయించే రెండు స్థానాల కోసం ఆశావహుల జాబితా పెద్దగానే ఉంది. ప్రస్తుత ఎంపీ సానా సతీశ్‌కు తిరిగి అవకాశం ఇస్తారా? లేక పార్టీలో ఆయనకు కీలక పదవిని ఇచ్చి ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమిస్తారా? అనే చర్చ జరుగుతోంది. ఆయనకు కాకపోతే మంత్రి లోకేశ్ సన్నిహితుడు కిలారు రాజేశ్ పేరు పరిశీలనలో ఉంది. వీరితో పాటు భారత్ బయోటెక్ ఛైర్మన్ కృష్ణ ఎల్లా, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమా, సీనియర్ నేత వర్ల రామయ్య పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. మొత్తం మీద అన్నామలై పేరు తెరపైకి రావడంతో ఏపీ రాజ్యసభ ఎన్నికల రాజకీయం మరింత ఆసక్తికరంగా మారింది. కూటమిలోని పార్టీలు ఎవరిని ఎంపిక చేస్తాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



## ధర్మపురి నర్సన్న సేవలో ఎమ్మెల్యే సంజయ్

ధర్మపురి, ఏప్రిల్ 22 (ఈవార్తలు): జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ బుధవారం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం దేవస్థాన అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, దేవస్థాన సూపరింటెండెంట్ కిరణ్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, అర్చకులు నంబి నరసింహమూర్తి, చక్రపాణి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత ఈ-టెండర్ రద్దు: ఎల్ రమణ



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): చేనేత కార్మికుల పొట్టకొట్టేలా ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన పీఎంయు ఈ -టెండర్ నోటిఫికేషన్ ను హైకోర్టు రద్దు చేయడం చేనేత కుటుంబాల విజయమని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ పేర్కొన్నారు. రాష్ట్రంలో 17 వేలకు పైగా హ్యాండ్ లుమ్స్ ఉండగా, వాటిపై ఆధారపడి 40 వేల చేనేత కుటుంబాలు పని చేస్తున్నాయని, కానీ రాష్ట్ర ప్రభుత్వం బడా కాంట్రాక్టర్ల ఒత్తిడి మేరకు ప్రత్యేక జీవో ద్వారా ఈ - టెండర్ విధానం తెచ్చి చేనేత కార్మికుల పొట్ట కొట్టాలని చూసిందన్నారు. దీనిపై చేనేత కార్మికులు హైకోర్టును ఆశ్రయించగా న్యాయం జరిగిందన్నారు. గురుకుల విద్యా సంస్థలు, అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలకు అవసరమయ్యే బెడ్ షీట్లు, కార్పెట్లు, టవల్స్ అన్నీ టెస్కో ద్వారానే తీసుకోవాలనే హైకోర్టు వెంటనే యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని ఎమ్మెల్సీ రమణ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, వస్త్రాల కొనుగోళ్ళ కోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించి, చేనేత కార్మికులకు పని కల్పించాలన్నారు. ఇందుకోసం అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలనీ ఎమ్మెల్సీ ఎల్. రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రతి గింజా కొంటాం: అడ్లూరి



గొల్లపల్లి, ఏప్రిల్ 22 (ఈవార్తలు): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ సూచించారు. బుధవారం గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లె గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కేంద్రాల్లో కల్పించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో తప్పుడు తూకాలు పేరిట క్వింటాల్‌కు నాలుగు నుంచి ఐదు కిలోల వరకు కోతలు విధించేవారని విమర్శించారు. ప్రస్తుతం మధ్యవర్తుల దోపిడీ లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరేలా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమ సంతోష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో సందడిగా గ్రాడ్యుయేషన్ డే



**జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): జగిత్యాల అర్బన్ 3 అంగన్వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పిల్లలలో ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లు పెంచడంపై అవగాహన కల్పించారు. పిల్లలలో అధిక స్కీన్ టైం తగ్గించి ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించడం ఇండోర్ గేమ్స్ ఔట్డోర్ గేమ్స్ పాటలు రైమ్స్ వినిపించారు. తలితండ్రులతో కలిసి సమయం గడిపేలా వారికీ అవకాశాలు కలిపించి ప్రతి పిల్లలకు వారి వయసు ప్రకారం రోజులో ఎంత టైం ఫోన్ వాడాలనే అంశంపై అవగాహన కల్పించారు.అంగన్వాడీ స్కూల్ ప్రీస్కూల్ పిల్లల అసైన్ మెంట్ కార్డులపై వారి తలితండ్రులకు వివరించి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సూపర్వైజర్ స్వరూపరాణి, అంగన్వాడీ టీచర్స్ రిజవ్వాన బేగం, షహీన్, తిరుమల, సహీబా, అతియభాను,సాజిదా, విజయలక్ష్మి, తల్లులు, పిల్లలు, ఆయాలు పాల్గొన్నారు.**



## కాళేశ్వరమే తెలంగాణ జీవధార: సుంకె రవిశంకర్

చొప్పదండి, ఏప్రిల్ 22 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, పీసీ ఘోష్ కమిషన్ నివేదిక పూర్తిగా బోగస్ అని, చెత్తబుట్టలో వేయాల్సిందేనని తీవ్రంగా విమర్శించారు. కమిషన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాన్ని దెబ్బతీయాలనే రేవంత్ రెడ్డి ప్రభుత్వ కుట్రలను హైకోర్టు తీర్పు తిప్పికొట్టిందని పేర్కొన్నారు. తెలంగాణ జీవధారగా భావించే ఈ ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు పునుగోటి కృష్ణరావు, పెద్ది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో గంజాయి దందా.. ఒకరి అరెస్ట్

ధర్మపురి, ఏప్రిల్ 22 (ఈవార్తలు): గంజాయితో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండల కేంద్రానికి చెందిన ఈసారపు ప్రణీత్ కుమార్ (25) అనే వ్యక్తి గంజాయి సేవకు అలవాటు పడి, అదే మత్తులో ధర్మపురి ప్రాంతంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో తిరుగుతున్నాడు. ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్నారు. అనంతరం విచారణ జరిపి అతడి వివరాలు సేకరించారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 60 గ్రాముల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు పంచుల సమక్షంలో సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మపురి సబ్ ఇన్‌స్పెక్టర్ జి. మహేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, గంజాయి వినియోగం లేదా రవాణా చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.




## ఆర్టీసీ కార్మికులకు బీఆర్ఎస్ మద్దతు: జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): ఆర్టీసీ బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆర్టిసి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. ఆర్టిసి కార్మికుల సమ్మెకు మద్దతుగా జగిత్యాల పట్టణంలోని ఆర్టిసి డిపో ఎదుట బిఆర్ఎస్ శ్రేణులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ జడ్పి చైర్పర్సన్ దావ వసంతలు మాట్లాడుతూ ఆర్టిసి కార్మికులకు ఈ పరిస్థితి రావడం బాధాకరమని, ఏ కార్మికుడు కూడా సమ్మె వెళ్లాలని కోరుకోరని, కాంగ్రెస్ పార్టీ ఆర్టిసి కార్మికులను ఆదుకుంటామని చెప్పి ఇప్పుడు హామీని వి స్మరిస్తున్నారన్నారు. ఆర్టిసి కార్మికుల కారణంగా మహాలక్ష్మి పథకం అవుతుందని, కార్మికులకు రావాల్సిన 5 డిఏలో పెండింగ్ ఉన్నాయని, 2021, 2025 పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిసి బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆర్టిసి ప్రభుత్వంలో విలీనం చేసే విధంగా అపాయింట్ డే ప్రకటించాలన్నారు. రవాణా సదుపాయాలను ప్రభుత్వం మెరుగుపర్చాలని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి కార్మికులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెల్గటూర్‌లో ఐకేపీ సెంటర్ల ప్రారంభం

వెల్గటూర్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు వెల్గటూర్ మండలంలోని పలు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు (ఐకేపీ సెంటర్లు) బుధవారం ప్రారంభమయ్యాయి. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేలా ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, వెల్గటూర్ ఎమ్మార్వో శేఖర్, ఆర్ఐ రాజేశ్వరి, మండల అధ్యక్షుడు శైలందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఇంచార్జి గోళ్ళ తిరుపతి పాల్గొన్నారు. అలాగే సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులు తెలిపారు.




## కొండగట్టు అంజన్న జన్మోత్సవ ఏర్పాట్లు పరిశీలన

మల్యాల, ఏప్రిల్ 22 (ఈవార్తలు): కొండగట్టు అంజన్న ఆలయంలో మే నెల 10, 11, 12 తేదీలలో వైభవంగా నిర్వహించనున్న జన్మోత్సవాలను (పెద్ద జయంతి ఉత్సవాలు) విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ఆలయ ఈవో అంజనారెడ్డితో కలసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను చేయాలని ఆలయ ఈవోకు సూచించారు. వీరి వెంట సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్, ఇంచార్జి డీఈ రఘునందన్, ఏఈవో హరిహరనాథ్ , సుపరింటెండెంట్ సునీల్, చంద్రశేఖర్, స్థానాచారి కపిందర్, ఉపప్రధాన అర్చక చిరంజీవి ఉన్నారు.

## ఖర్గే క్షమాపణలు చెప్పాలి: ఏసీఎస్ రాజు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): తమిళనాడులో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దేశ ప్రధాని నరేంద్ర మోడీపై చేసిన వ్యాఖ్యలను భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు తీవ్రంగా ఖండించారు. బుధవారం జగిత్యాలలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' అనే పాలన విధానంతో అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిని ఉగ్రవాదిగా అభివర్ణించడం సరికాదని, ఇది కేవలం మోడీని మాత్రమే కాదు, దేశంలోని 140 కోట్ల భారతీయులను అవమానించడమేనని అన్నారు. ఉగ్రవాదులకు, దేశద్రోహులకు ఊతమిచ్చే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. వెంటనే ఖర్గే ప్రధాని మోడీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి కాశీనాథం, కార్యదర్శి సింగం గంగాధర్, ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, చెట్ల గంగాధర్, నరేందుల శ్రీనివాస్, వేముల దేవరాజం, ఎడమల వెంకట్ రెడ్డి, బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య గుడికి రూ.3 లక్షల విరాళం

మల్యాల, ఏప్రిల్ 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన శ్రీరామ మందిరం కోసం విరాళాల సేకరణ విజయవంతంగా సాగుతోంది. ఇప్పటి వరకు మొత్తం 40 లక్షల వరకు నిధి సేకరించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ తెలిపింది. బుధవారం ఒక్క రోజే రూ.5 లక్షలు పోగయ్యాయని, మల్యాలకు చెందిన నల్ల సంజీవ్ రూ.3,00,099 విరాళంగా అందజేశారని పేర్కొన్నారు.

## ఖర్గే దిష్టిబొమ్మ దహనం

మల్యాల, ఏప్రిల్ 22 (ఈవార్తలు): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార భాగంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే.. ప్రధాని మోదీని ఉద్దేశించి ఉగ్రవాది అని మాట్లాడటంపై బీజేపీ నేతలు భగ్గుమన్నారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ, జిల్లా శాఖల ఆధ్వర్యంలో మల్యాలలో ఖర్గే దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మండల ఉపాధ్యక్షులు కోను శ్రీనివాస్ , గుగ్గిల గంగారాం, ప్రధాన కార్యదర్శులు పొన్నం సాయికుమార్, పిల్లి రాజశేఖర్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సుంకపాక టైటాస్, బీజేవైఎం అధ్యక్షుడు పొనుగంటి గౌతం, రాచర్ల రాములు, మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేశ్, గుండేటి గంగారాం, పోరెడ్డి రంజిత్, భరత్, పరశురాం, నీలం రవి, జనగం రాములు, పంబాల గంగాధర్, సంత శ్రీకాంత్, జవ్వాజి రాజ్ కుమార్, ముత్యాల మధు, నక్క ఆనందం, సందీప్, పొన్నగంటి రాఘవేంద్ర, పొన్నగంటి రవి, పంబాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల డిపోలో ఆగిన బస్సులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో టీజీఎస్ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను అమలు చేయడంతో పాటు బకాయిలను తక్షణమే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆర్టీసీని కార్పొరేషన్ నుంచి ప్రభుత్వం లోకి విలీనం చేయాలని ప్రధాన డిమాండ్‌గా ముందుకు తెచ్చారు. సమ్మె ప్రభావంతో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డిపోలకే సుమారు 250 బస్సులు పరిమితమయ్యాయి. బస్సులు నిలిచిపోవడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కార్మికుల సమ్మెకు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికుల డిమాండ్లు న్యాయమైనవని పేర్కొన్నారు.

## సీఎంఆర్ డెలివరీలు పెండింగ్ ఉండొద్దు

**జగిత్యాల అదనపు కలెక్టర్ బీఎస్ లత**

ధర్మపురి, ఏప్రిల్ 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కేంద్రంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీఎస్ లత బుధవారం పలు రైస్ మిల్లులను సందర్శించారు. మండలంలోని శ్రీనివాస ఇండస్ట్రీస్, పద్మావతి ఇండస్ట్రీస్, ధనలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లులను పరిశీలించి నిర్వహణను సమీక్షించారు. ఈ సందర్భంగా రబీ 2024-25, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీలు పెండింగ్‌లో లేకుండా, వేగంగా బియ్యం సరఫరా చేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు సర్కారుకు చెంపదెబ్బ: దావ వసంత

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ సర్కార్‌కు చెంపదెబ్బగా నిలిచిందని జిల్లా తొలి జడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్ అన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని తాసిల్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టేను స్వాగతిస్తున్నామని తెలిపారు. రాజకీయ కక్షసాధింపుల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది గట్టి హెచ్చరిక అని అన్నారు. రెండున్నరేళ్లుగా కల్పతరువులాంటి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా రాష్ట్ర రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం, చట్టాలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినా న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందన్నారు. గోదావరి జలాలను ఇతర రాష్ట్రాలకు మళ్లించి తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే ప్రయత్నాలు కొనసాగిస్తే రైతులు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు.

# 80 శాతం నేతలు పోర్న్ చూస్తారు: పప్పు యాదవ్

**కావాలంటే అందరి ఫోన్లను తనిఖీ చేయాలని సవాల్**




పాట్నా: ఎంపీ పప్పూ యాదవ్ మరోసారి తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. రాజకీయాల్లోకి వచ్చే మహిళలపై గతంలో చేసిన అనుచిత వ్యాఖ్యల దుమారం చల్లారకముందే, బుధవారం ఆయన మరో సంచలన ఆరోపణ చేశారు. దేశంలోని 70 నుంచి 80 శాతం మంది రాజకీయ నాయకులు పోర్న్ (అశ్లీల చిత్రాలు) చూస్తారని, తన ఫోన్‌తో సహా అందరి ఫోన్లను తనిఖీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ.. "రాజకీయాల్లోకి రావాలంటే 90 శాతం మంది మహిళలు ఎవరో ఒక పురుష నేత గదిలోకి వెళ్లాల్సిందే" అంటూ పప్పూ యాదవ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. మహిళలను కించపరిచేలా ఉన్న ఈ వ్యాఖ్యలపై బిహార్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై స్పందిస్తూ పప్పూ యాదవ్ మరింత ఘాటుగా బదులిచ్చారు. "70–80 శాతం మంది రాజకీయ నాయకులు పోర్న్ చూస్తారని నేను సభలో కూడా చెప్పాను. అందరినీ తనిఖీ చేయండి. నా ఫోన్‌లో పోర్న్ ఉంటే నన్ను కూడా చెక్ చేయండి. నాకు నోటీసులు ఇవ్వడానికి వీళ్లెవరు? వీళ్లు ఎవరితో ఉన్నారు?" అని ఆయన ప్రశ్నించారు. అంతేగాక మహిళా కమిషన్ సభ్యురాలు సజల్ పలువురు నేతలతో ఉన్న ఫొటోలు తన వద్ద ఉన్నాయని, వాటిని బయటపెడతానని హెచ్చరించారు. తాను మహిళల పక్షానే పోరాడుతున్నానని, పురుష రాజకీయ నాయకులు మహిళలను వాడుకోకుండా రాజకీయాల్లోకి రానివ్వరని తాను చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. "దేశవ్యాప్తంగా 755 మంది పురుష రాజకీయ నాయకులపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయి. 155 మందిపై చార్జ్‌షీట్లు కూడా దాఖలయ్యాయి. నేను పురుష నేతల గురించి మాట్లాడితే మహిళా కమిషన్‌కు ఎందుకు అంత బాధ? ఈ నేతలు మహిళలను దోపిడీ చేస్తూనే మహిళా రిజర్వేషన్ చట్టం గురించి మాట్లాడతారు" అని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై ఆయనకు మద్దతిస్తున్న కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా తీవ్రంగా స్పందించి, ఆయన వైఖరిని ఖండించాయి. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ రాకుండా విఫలమైన నేపథ్యంలో పప్పూ యాదవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.


# భారత నగరాలు.. అగ్నిగోళాలు

## ప్రపంచంలోని 20 హాటెస్ట్ నగరాల్లో 19 మనవే

**ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలకు భారత్ కేంద్రంగా మారింది. ఏప్రిల్ 21న ఏక్యూఐ.ఇన్ విడుదల చేసిన డేటా ప్రకారం ప్రపంచంలోని 20 అత్యంత వేడి నగరాల జాబితాను పరిశీలిస్తే అందులో 19 నగరాలు భారత్‌లోనే ఉన్నాయి.**




న్యూఢిల్లీ: దేశంలోని ఉత్తర, మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. బిహార్‌లోని భాగల్‌పూర్, ఒడిశాలోని తాల్చేర్, పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ నగరాలు 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. వీటితో పాటు బిహార్‌లోని బెగుసరాయ్, మోతిహారి, ముంగేర్, భోజ్‌పూర్, సివాన్‌లతో పాటు పశ్చిమ బెంగాల్, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ జాబితాలో భారత్ వెలుపల ఉన్న ఏకైక ప్రాంతం నేపాల్‌లోని లుంబిని కావడం గమనార్హం. మరోవైపు, ఏప్రిల్ 22 నుంచి 24 వరకు దేశంలో వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సాధారణంగా గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటితే దానిని వడగాల్పుగా పరిగణిస్తారు. వాతావరణ నిపుణుల ప్రకారం ఈ తీవ్రమైన వేడికి పలు కారణాలు ఉన్నాయి. నిర్మలమైన ఆకాశం కారణంగా సూర్యరశ్మి నేరుగా భూమిని తాకడం, హిమాలయాల్లో మంచు కవచం తగ్గడం, వాయవ్య దిశ నుంచి పొడి గాలులు వీయడం వంటివి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. సముద్రపు నీటి ఉష్ణోగ్రతల్లో మార్పులు కూడా దీనికి దోహదం చేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. రాబోయే వారాల్లో కూడా వేడి తీవ్రత కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.




# కేదార్‌నాథ్ దర్శనం ప్రారంభం

డెహ్రాడూన్: ఆధ్యాత్మిక ప్రపంచంలో నేడు ఒక పవిత్ర ఘట్టం ఆవిష్కృతమైంది. ఉత్తరాఖండ్‌లోని అత్యంత పవిత్రమైన శ్రీ కేదార్‌నాథ్ ధామం తలుపులు నేడు భక్తుల దర్శనార్థం తెరుచుకున్నాయి. మంచు కొండల నడుమ కొలువైన కేదార్‌నాథ్ ఆలయం బుధవారం ఉదయం 8 గంటలకు వైభవంగా తెరుచుకుంది. వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాల మధ్య సుమారు 51 క్వింటాళ్ల పూలతో అందంగా అలంకరించిన ఈ పుణ్యక్షేత్రం భక్తులకు స్వాగతం పలికింది. స్వామి వారి సందర్శనార్థ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మరోవైపు, రేపు విష్ణుమూర్తి నివాసమైన బద్రీనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక సందేశాన్ని ఇచ్చారు. చార్‌ధామ్ యాత్ర మన దేశ విశ్వాసానికి, ఐక్యతకు మరియు సుసంపన్నమైన సంప్రదాయాలకు దివ్య ఉత్సవం వంటిదని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి యాత్ర సుఖమయంగా సాగాలని, బాబా కేదార్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# జేడీ వాన్స్ పాక్ పర్యటన వాయిదా

వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చల పునరుద్ధరణపై నెలకొన్న ఉత్కంఠకు ప్రస్తుతానికి తెరపడలేదు. పాకిస్థాన్‌లో జరగాల్సిన రెండో విడత చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం చేయాల్సిన పర్యటన తాత్కాలికంగా వాయిదా పడింది. చర్చల్లో పాల్గొనడంపై ఇరాన్ నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడమే ఇందుకు కారణమని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అభ్యర్థన మేరకు ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. ఇరాన్ ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వచ్చేవరకు ఈ సీజ్‌ఫైర్ కొనసాగుతుందని తెలిపారు. అయితే, కాల్పుల విరమణను పొడిగించినప్పటికీ, హార్మూజ్ జలసంధిలో అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇదే అంశం చర్చలకు ప్రధాన అడ్డంకిగా మారింది. నౌకా దిగ్బంధనాన్ని ఎత్తివేసే వరకు తాము చర్చలకు హాజరుకాబోమని ఇరాన్ తేల్చిచెప్పింది. అమెరికా చర్యల వల్ల వారి చిత్తశుద్ధిపై అనుమానాలు ఉన్నాయని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు.

# అమెరికా దిగ్బంధాన్ని ఛేదిస్తున్న ఇరాన్

**అగ్రరాజ్యం కళ్లుగప్పి**

**బిలియన్ డాలర్ల వ్యాపారం**



టెహ్రాన్: హార్మూజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని, ఇరాన్‌తో తుది ఒప్పందం కుదిరే వరకు సముద్ర దిగ్బంధం ఎత్తివేసేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. ఈ దిగ్బంధం అద్భుత విజయం సాధించిందని ఆయన పేర్కొన్నారు. అయితే, వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, అమెరికా ఆంక్షలను దాటుకుని ఇరాన్‌కు చెందిన డజన్ల కొద్దీ నౌకలు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయని అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం ఈ నెల 13న అమెరికా దిగ్బంధం విధించినప్పటి నుంచి ఇరాన్‌కు సంబంధమున్న కనీసం 34 ట్యాంకర్లు హార్మూజ్ జలసంధిని దాటాయి. వీటిలో 19 ట్యాంకర్లు గల్ఫ్ నుంచి బయటకు వెళ్లగా, మరో 15 గల్ఫ్‌లోకి ప్రవేశించాయి. బయటకు వెళ్లిన వాటిలో ఆరు నౌకలు సుమారు 10.7 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును రవాణా చేస్తున్నట్లు నిర్ధారణ అయింది. దీని ద్వారా ఇరాన్‌కు దాదాపు 910 మిలియన్ డాలర్ల ఆదాయం సమకూరినట్లు అంచనా. ఇప్పటివరకు అమెరికా దళాలు కేవలం ఒక కంటైనర్ షిప్‌ను అదుపులోకి తీసుకుని, 28 నౌకలను వెనక్కి పంపినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. అమెరికా నిఘా నుంచి తప్పించుకోవడానికి ఇరాన్ నౌకలు అత్యాధునిక పద్ధతులు వాడుతున్నాయి. 'డొరెనా' అనే ఇరాన్ సూపర్‌ట్యాంకర్ తన ఉనికిని, లొకేషన్‌ను తెలిపే ట్రాన్స్‌పాండర్‌ను ఆపివేసి జలసంధిని దాటింది. ఆ తర్వాత మలేషియా తీరంలో మరో నౌకలోకి చమురును మార్పిడి చేసి, దాని మూలాలను దాచిపెట్టే ప్రయత్నం చేసింది. గతంలో అమెరికా ఆంక్షలు ఎదుర్కొన్న 'మురళీకిషన్', 'అలీసియా' వంటి ట్యాంకర్లు కూడా ఈ దిగ్బంధనాన్ని దాటి గల్ఫ్‌లోకి ప్రవేశించాయి. మరోవైపు ఇరాన్ కూడా ప్రతివ్యూహాలు రచిస్తోంది. హార్మూజ్ జలసంధి నియంత్రణ తిరిగి తమ చేతికి వచ్చిందని, జలసంధి గుండా వెళ్లే ప్రతి నౌక తమ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ నేవీ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. పౌర నౌకలకు ప్రత్యేక మార్గాన్ని నిర్దేశిస్తూ, సైనిక నౌకల రాకపోకలను పూర్తిగా నిషేధించింది. ఇటీవల ఇరాన్ దళాలు ఫ్రాన్స్, భారత్‌కు చెందిన నౌకలపై కాల్పులు జరపడం ఉద్రిక్తతలను పెంచింది. ఈ పరిణామాలతో నౌకల యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇది ఒకవైపు అమెరికా, మరోవైపు ఇరాన్ విధించిన 'డబుల్ దిగ్బంధం'గా మారిందని వాపోతున్నారు.

# పాక్‌లో 6 లక్షల మంది నకిలీ వైద్యులు

**బయటపెట్టిన బీబీసీ స్టింగ్ ఆపరేషన్**



ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ప్రజారోగ్యం అత్యంత దయనీయ స్థితికి చేరింది. వైద్య వ్యవస్థ నిర్లక్ష్యం, అడ్డూ అదుపూ లేని వైద్య సంస్కృతి కారణంగా ఆ దేశం ప్రపంచంలోనే అత్యధిక హెపటైటిస్ సి రోగులతో మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా 6 లక్షల మందికి పైగా ఉన్న నకిలీ వైద్యులు (క్వాక్ డాక్టర్లు) ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నారు. పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ దినపత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' ప్రచురించిన ఒక కథనం ప్రకారం దేశంలో హెపటైటిస్ సి బారిన పడిన వారి సంఖ్య సుమారు 1 కోటి వరకు ఉంది. హెపటైటిస్ బి బాధితులతో కలిపి చూస్తే, దాదాపు 1.38 కోట్ల నుంచి 1.5 కోట్ల మంది ఈ వైరస్‌లతో జీవిస్తున్నారని, వారిలో కేవలం 25–30 శాతం మందికి మాత్రమే తమకు వ్యాధి ఉన్నట్లు తెలుసని ఆ కథనం పేర్కొంది. ఆసుపత్రులలో వాడిన సిరంజీలను మళ్లీ ఉపయోగించడం, అసురక్షిత రక్త మార్పిడి, సరైన స్టెరిలైజేషన్ పద్ధతులు పాటించకపోవడం వంటి తీవ్రమైన నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని వివరించింది. రోగుల భద్రత కంటే లాభాలకే ప్రాధాన్యత ఇచ్చే నకిలీ వైద్యుల క్లినిక్‌లు లక్షలాది మందిని ఈ ప్రాణాంతక ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడేలా చేస్తున్నాయని ఆరోపించింది. ఈ దుస్థితికి అద్దం పట్టేలా, పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 'బీబీసీ ఐ ఇన్వెస్టిగేషన్స్' నిర్వహించిన ఒక రహస్య ఆపరేషన్‌లో భయంకర వాస్తవాలు బయటపడ్డాయి. తౌన్సాలోని తహసీల్ హెడ్ క్వార్టర్స్ (టీహెచ్‌క్యూ) ఆసుపత్రిలో చికిత్స పొందిన 331 మంది చిన్నారులకు హెచ్‌ఐవీ సోకినట్లు తేలింది. 2025లో ఈ విషయం వెలుగులోకి రావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించినా, ఆ తర్వాత కూడా అక్కడి పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదని బీబీసీ తన స్టింగ్ ఆపరేషన్‌లో బట్టబయలు చేసింది. బీబీసీ రహస్యంగా చిత్రీకరించిన వీడియోలలో నర్సులు పిల్లలకు బట్టల పైనుంచే ఇంజక్షన్లు ఇవ్వడం, వాడిన మురికి సిరంజీలనే మళ్లీ వాడటం, అర్హత లేని సిబ్బంది రక్తంతో కలుషితమైన మందులనే చిన్నారులకు ఎక్కించడం వంటి దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. సిబ్బంది కొరత, మందుల కొరతతో ఈ దురాగతాలు కొనసాగుతున్నాయని, కొన్నిసార్లు రోగుల కుటుంబ సభ్యులనే మందులు కొనుక్కొని తెచ్చుకోమని సిబ్బంది అడుగుతున్నారని బీబీసీ రిపోర్ట్ పేర్కొంది. ప్రభుత్వ ప్రకటనలు కాగితాలకే పరిమితం కావడం, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కొనసాగుతుండటంతో పాకిస్థాన్‌లో ప్రజల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయని స్పష్టమవుతోంది.

# రెండ్రోజుల్లో 'శాంతి' వార్త!

**ఇరాన్‌తో చర్చలపై ట్రంప్ వ్యాఖ్యలు**

**ట్రంప్ వ్యాఖ్యలను కొట్టిపారేసిన ఇరాన్**

**చర్చలపై నిర్ణయం తీసుకోలేదని స్పష్టీకరణ**

వాషింగ్టన్: ఇరాన్‌తో రెండో విడత శాంతి చర్చలపై శుక్రవారం నాటికి 'శుభవార్త' వెలువడొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే 36 నుంచి 72 గంటల్లో చర్చలు పునఃప్రారంభం కావచ్చని ఇవాళ 'న్యూయార్క్ పోస్ట్' సైతం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ "అది సాధ్యమే" అని బదులివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌కు అనుబంధంగా పనిచేసే 'తస్నీమ్ న్యూస్' ఏజెన్సీ ఈ మేరకు 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేసింది. "ట్రంప్ మళ్లీ అబద్ధం చెప్పారు. శుక్రవారం చర్చలు జరిపే అంశంపై ఇరాన్‌కు ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం లేదు" అని స్పష్టం చేసింది. శాంతి చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకు అమెరికా ప్రకటించిన కాల్పుల విరమణను ట్రంప్ పొడిగించారు. ఈ వ్యూహ మార్పునకు పాకిస్థాన్ నాయకత్వంతో జరిపిన సంప్రదింపులే కారణమని ట్రంప్ పేర్కొన్నారు. "ఇరాన్ ప్రభుత్వం అంతర్గతంగా తీవ్రంగా చీలిపోయింది. పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ అభ్యర్థన మేరకు.. ఇరాన్ నేతలు ఒక ఏకీకృత ప్రతిపాదనతో వచ్చేవరకు ఆ దేశంపై దాడిని నిలిపివేయాలని నిర్ణయించాం" అని ట్రంప్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. "మా సైన్యాన్ని అప్రమత్తంగా ఉండాలని, దిగ్బంధనాన్ని కొనసాగించాలని ఆదేశించాను. ఇరాన్ ప్రతిపాదన వచ్చేవరకు కాల్పుల విరమణను పొడిగిస్తున్నాను" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.



# గుజరాత్ పోర్టుకు వస్తున్న నౌక సీజ్

టెహ్రాన్: హార్మూజ్ జలసంధి వద్ద కీలక పరిణామం చోటు చేసుకుంది. గుజరాత్ పోర్టుకు వస్తున్న నౌక సహా రెండు కంటైనర్లను ఇరాన్ సీజ్ చేసింది. కాల్పుల విరమణ గడువును పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తూనే, పోర్టుల దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని తెలిపారు. దీనితో ఇరాన్ ధీటుగా స్పందిస్తోంది. ఈ క్రమంలో రెండు నౌకలపై ఇరాన్ ఉదయం కాల్పులు జరిపింది. అలాగే రెండు నౌకలు తమ స్వాధీనంలో ఉన్నట్లు ఐఆర్జీసీ తెలిపింది. ఇందులో ఒక నౌక గుజరాత్ తీరానికి వస్తున్న క్రమంలో చోటు చేసుకుంది. పనామా జెండా కలిగిన ఎంఎస్సీ ఫ్రాన్సిస్కా, లైబీరియా జెండా కలిగిన ఎపామినోండాస్ కార్గో నౌకలు తమ ఆధీనంలో ఉన్నట్లు ఇరాన్ మీడియా ప్రకటించింది. గ్రీస్‌కు చెందిన యూఫోరియా అనే మరో నౌకను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటించింది.

# సీఎంగా ఉండి అదేం ప్రవర్తన?

**మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు ఫైర్**

న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తించే పరిస్థితి తలెత్తుతుందని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఎప్పుడూ ఊహించి ఉండరని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై అసహనం వ్యక్తం చేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ 'ఐప్యాక్'పై జరుగుతున్న ఈడీ విచారణలో ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు నేరుగా కలుగజేసుకోవడంపై సుప్రీంకోర్టు స్పందించింది. విచారణలో కలుగజేసుకోవడం సరికాదని పేర్కొంది. మమతా బెనర్జీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బెంగాల్‌లో చోటుచేసుకున్న బొగ్గు కుంభకోణానికి సంబంధించి నమోదైన మనీలాండరింగ్ కేసును ఈడీ దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తులో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటున్నారంటూ ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇలా వ్యవహరించడం సరికాదని పేర్కొంది. ఇది రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వివాదం కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఓ ముఖ్యమంత్రి నేరుగా విచారణలో జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదని అన్నారు. ఈ అంశాన్ని రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వివాదంగా తయారు చేయవద్దని కోరింది. మీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని మమతా బెనర్జీని ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

# భారత్‌ను తాకితే..!

**పాక్‌కు రాజ్‌నాథ్ వార్నింగ్!.. పహల్గాం ఉగ్రదాడికి ఏడాది**

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి జరిగి నేటికి సరిగ్గా ఏడాది. పహల్గాం సమీపంలోని బైసరణ్ వ్యాలీలో పర్యాటకులపై జరిగిన ఘోర ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జర్మనీ పర్యటనలో ఉన్నప్పటికీ, అక్కడి నుంచే పాకిస్థాన్‌కు అత్యంత శక్తిమంతమైన హెచ్చరికలు జారీ చేశారు. "భారత్ తనంతట తానుగా ఎవరిపైనా దాడి చేయదు. కానీ మా పొరుగున ఒకే ఒక దేశం ఎప్పుడూ సమస్యలు సృష్టిస్తుంది. ఆ దేశం భారత్‌ను ప్రమాదంలో పడేయాలని చూస్తే... మన ప్రతిస్పందన 'డాట్, డాట్, డాట్' స్థాయిలో ఉంటుంది" అంటూ పాక్ పేరు ఎత్తకుండానే రాజ్‌నాథ్ గట్టిగా హెచ్చరించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా గతేడాది మే నెలలో భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి ఆయన ప్రస్తావించారు. ఆ ఆపరేషన్‌లో భాగంగా పాక్ భూభాగంలోని 9 ఉగ్రవాద శిబిరాలను, 11 వైమానిక స్థావరాలను మన సైన్యం ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు మన సైనిక శక్తి మరింత పెరిగిందని స్పష్టం చేశారు. ఇటీవల పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ 'కోల్‌కతాపై దాడి చేస్తాం' అంటూ చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలపై కూడా రాజ్‌నాథ్ స్పందిస్తూ, భారత్ సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తే తగిన బుద్ధి చెబుతామని పరోక్షంగా సమాధానమిచ్చారు.

# బాలిలో హోటల్ వస్తువులు దొంగతనం

**భారతీయ టూరిస్టుల చిల్లర చేష్టలు**

బాలి: ఇండోనేషియాలోని బాలిలో, గియన్యార్ ప్రాంతంలోని ఒక విలాసవంతమైన రిసార్ట్ నుండి హోటల్ వస్తువులను తస్కరించారని నలుగురు భారతీయులు ఆరోపణలు ఎదుర్కొన్నారు. చెక్–అవుట్ సమయంలో హోటల్ సిబ్బంది వారి బ్యాగులను తనిఖీ చేస్తున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. హోటల్ ఖాళీ చేసే సమయంలో వారు అక్కడి వస్తువులను తస్కరించినట్లు తేలింది. వారి బ్యాగ్‌లో హెయిర్ డ్రైయర్, డోర్ మ్యాట్, టీవీ రిమోట్ తదితర వస్తువులు లభించాయి. భారత్‌కు చెందిన నలుగురు టూరిస్టులు గియన్యార్ ప్రాంతంలో ఉన్న హోటల్లో దిగారు. రెండు మూడు రోజులు అక్కడే ఉన్నారు. ఏప్రిల్ 19వ తేదీ ఉదయం ఖాళీ చేసేందుకు సిద్ధమయ్యారు. బ్యాగులు సర్దుకుని బయటకు వచ్చారు.

## వయ్యారి చిత్రం






## జననాయగన్ లీక్ దురదృష్టకరం



మలయాళీ ముద్దుగుమ్మ మమితా బైజు, 'ప్రేమలు' సినిమాతో ఓవర్‌నైట్ సెన్సేషన్‌గా మారి, ఇప్పుడు సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో వరుస ప్రాజెక్టులతో ఈ భామ ఫుల్ బిజీగా గడుపుతోంది. తాజాగా మమిత ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్, త్వరలో విడుదల కాబోతున్న సినిమాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. దళపతి విజయ్ హీరోగా, హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జన నాయగన్' చిత్రంలో మమితా బైజు ఒక కీలక పాత్ర పోషించింది. పూజా హెగ్డే హీరోయిన్‌గా, ప్రియామణి ముఖ్య పాత్రలో నటించిన ఈ సినిమా సెన్సార్ సమస్యల వల్ల వాయిదా పడుతూ వస్తోంది. అయితే, ఈ సినిమా ఆన్‌లైన్‌లో లీక్ అవ్వడంపై మమిత తీవ్ర విచారం వ్యక్తం చేసింది. "ఈ విషయం నా తమ్ముడి ద్వారా తెలిసినప్పుడు మొదట నమ్మలేదు. సోషల్ మీడియాలో అబద్ధాలు కూడా ప్రచారం అవుతుంటాయని అనుకున్నా. కానీ అది నిజమని తెలిసి చాలా బాధపడ్డాను. టీమ్ అంతా ఎంతో కష్టపడి చేసిన సినిమా ఇలా లీక్ అవ్వడం దురదృష్టకరం" అని ఆమె పేర్కొంది. ధనుష్ సరసన నటిస్తున్న 'కర' సినిమా గురించి చెబుతూ ఆయన డెడికేషన్‌ను మమిత కొనియాడింది. "ధనుష్ గారు పని పట్ల చూపించే నిబద్ధత అద్భుతం.


## పెళ్లి ముందు రోజు రాత్రీ షూటింగ్: రమ్యకృష్ణ

టాలీవుడ్ సీనియర్ హీరోయిన్ రమ్యకృష్ణ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒకప్పుడు హీరోయిన్‌గా, నెగిటివ్ రోల్ లోనూ నటించి అందరిని మెప్పించారు రమ్యకృష్ణ. ఇక ప్రస్తుతం హీరో లేదా హీరోయిన్ తల్లి పాత్రల్లో మెరుస్తున్నారు. ఇప్పటి వరకు అన్ని భాషల్లో కలిపి 260కి పైగా సినిమాల్లో నటించిన రమ్యకృష్ణ, సింహాద్రి షూటింగ్ సమయంలో జరిగిన ఓ సంఘటనను గుర్తు చేసుకున్నారు. తన పెళ్లి కంటే ఒక్కరోజు ముందు



కూడా అర్ధరాత్రి రెండు గంటల వరకు షూటింగ్ లో పాల్గొన్నారు రమ్యకృష్ణ. ఈ విషయాన్ని స్వయంగా రమ్యకృష్ణ పంచుకున్నారు. దీంతో ఈ ఇన్సిడెంట్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా సింహాద్రి సినిమా 2003 సమయంలో వచ్చిన సంగతి తెలిసిందే. ఈ మూవీలో చిన్నదమ్మే చీకులు కావాలా నా సామిరంగ అనే సాంగ్ లో రమ్యకృష్ణ మెరిశారు. అయితే ఈ సాంగ్ ను చివరి క్షణంలో ఫైనల్ చేశారట. దీంతో తన పెళ్లి కంటే ఒక్కరోజు ముందు కూడా షూటింగ్ లో పాల్గొని.. ఫినిష్ చేశారట రమ్యకృష్ణ. పెళ్లి రేపు అనగా ఒక రోజు ముందు అర్ధరాత్రి రెండు గంటల వరకు ఈ సాంగ్ షూటింగ్ జరిగినట్లు రమ్యకృష్ణ తాజాగా వెల్లడించారు. ఆ తర్వాతే పెళ్లికి వెళ్లారట. ఇంత డెడికేషన్ తో పనిచేసిన రమ్యకృష్ణ, ఈ సినిమా తర్వాత మంచి పేరు దక్కించుకున్నారు. కాగా రమ్యకృష్ణ, కృష్ణవంశీ 2003లో పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే.

## నటి రన్యా రావు విడుదల



భారీ బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన సినీ నటి రన్యా రావుకు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. గత ఏడాది కాలంగా బెంగళూరులోని పరప్పణ అగ్రహారం జైలులో ఉంటున్న ఆమె, నేడు విడుదల కానున్నారు. సుమారు రూ.102 కోట్ల విలువైన బంగారం స్మగ్లింగ్ కేసులో రన్యారావు నిందితురాలిగా ఉన్నారు. ఈ భారీ కుంభకోణంలో ఆమె ప్రమేయం ఉందన్న ఆరోపణలతో గతంలో అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అప్పటినుండి ఈ కేసు విచారణ కొనసాగుతోంది. నిజానికి, రన్యారావుకు 2025 మే నెలలోనే ఈ కేసులో బెయిల్ లభించింది. అయితే, విదేశీ మారకద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఆమెపై చర్యలు ఉండటంతో బెయిల్ వచ్చినా ఆమె విడుదల కాలేదు. గత దాదాపు ఏడాది కాలంగా ఈ చట్టం కారణంగానే ఆమె జైలులోనే ఉండాల్సి వచ్చింది. తాజాగా 'కోఫెపోసా' చట్టం పరిధిలోని నిబంధనల నుండి కూడా ఆమెకు ఊరట లభించడంతో, విడుదల మార్గం సుగమమైంది. నేడు జైలు నుంచి ఆమె బయటకు రానున్నారు. ఈ పరిణామం కన్నడ సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది.

## అల్లు అర్జున్ ఇల్లు 80 కోట్లు



'పుష్ప 2' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, వ్యక్తిగతంగానూ, వృత్తిపరంగానూ ఫుల్ జోష్‌లో ఉన్నారు. తాజాగా ఆయన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సుమారు రూ.80 కోట్ల విలువైన ఒక విలాసవంతమైన భవంతిని నిర్మించుకున్నారు. త్వరలోనే తన కుటుంబంతో కలిసి ఈ కొత్త ఇంట్లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపు 4,000 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ గ్రాండ్ హౌస్‌లోకి అల్లు అర్జున్ తన భార్య స్నేహారెడ్డి, పిల్లలు అయాన్, అర్హ, ఇతర కుటుంబసభ్యులతో కలిసి మారనున్నారు.

## సల్మాన్, నయన్ భారీ ప్రాజెక్ట్ లాంచ్

భారతీయ సినీ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ సెట్స్ మీదకు వచ్చేసింది. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, సౌత్ లేడీ సూపర్ స్టార్ నయనతార జంటగా, టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్-ఇండియా చిత్రం ఎస్‌వీసీ63 షూటింగ్ అధికారికంగా ప్రారంభమైంది. అయితే దిల్ రాజ్ క్లాప్ కొట్టి షూటింగ్‌కు ఘనంగా ప్రారంభించారు. ప్రస్తుతం ముంబైలోని గోరేగావ్ ప్రాంతంలో ఉన్న ఎస్ఆర్‌పిఎఫ్ గ్రౌండ్‌లో వేసిన ఒక భారీ సెట్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. దాదాపు ఒక నెల రోజుల పాటు సాగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు సల్మాన్, నయనతారల మధ్య వచ్చే కీలకమైన డ్రామా సీన్లను వంశీ పైడిపల్లి చిత్రీకరించనున్నారట. ఈ సినిమా షూటింగ్‌ను ఆగస్టు లేదా సెప్టెంబర్ నాటికల్లా పూర్తి చేసి, ఈద్ 2027 కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లోకి నయనతార రావడంతో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.





## చిరుకు బెల్లంకొండ పెళ్లి పత్రిక

టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే ఒక ఇంటివాడు కాబోతున్నాడు. కావ్య రెడ్డితో ఏప్రిల్ 29న తిరుమలలో జరగనున్న తన వివాహ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులను ఆహ్వానించే పనిలో పడ్డాడు. తాజాగా తన తండ్రి బెల్లంకొండ సురేష్‌తో కలిసి మెగాస్టార్ చిరంజీవి నివాసానికి వెళ్లి పెళ్లి పత్రికను అందజేశాడు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వివాహం ఏప్రిల్ 29, 2026న తిరుమల శ్రీవారి సన్నిధిలో జరగనుంది. ఈ క్రమంలో టాలీవుడ్ పెద్ద దిక్కుగా ఉన్న మెగాస్టార్ చిరంజీవిని తన వివాహానికి ఆహ్వానించడానికి శ్రీనివాస్ తన కుటుంబంతో కలిసి వెళ్లారు. ఇక చిరంజీవికి పెళ్లి పత్రికను అందించి, వేడుకకు తప్పకుండా రావాలని కోరారు. ఈ సందర్భంగా మెగాస్టార్ ఈ యంగ్ హీరోను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

## శివాత్మిక బర్త్ డే సర్ ప్రైజ్



టాలీవుడ్ వెండితెరపై తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న నటి శివాత్మిక రాజశేఖర్. 'దొరసాని' సినిమాతో పద్ధతైన తెలుగు అమ్మాయిగా పరిచయమై, తన సహజసిద్ధమైన నటనతో అనతి కాలంలోనే విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ఆస్కారం ఉన్న వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ తండ్రికి తగ్గ తనయగా పేరు తెచ్చుకుంటోంది. ప్రస్తుతం యంగ్ హీరో అశోక్ గల్లా సరసన 'వింటారా సరదాగా' చిత్రంలో ఆమె ఒక కీలక పాత్ర పోషిస్తోంది. గత కొద్ది రోజులుగా ఆమె ఈ సినిమాలో నటిస్తుందన్న వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నా, మేకర్స్ మాత్రం చాలా సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ వచ్చారు. కానీ, తాజాగా శివాత్మిక పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు వెల్కమ్ చెబుతూ అధికారికంగా కన్ఫర్మ్ చేయడంతో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఇక హీరో అశోక్ గల్లా కూడా ఆమెకు విషెస్ చెప్పడం విశేషం.



# రాయల్.. జడ్డూ

## లక్నోపై కీలక విజయం.. పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి

## సొంత మైదానంలో ఓడిన లక్నో.. 119 పరుగులకే ఆలౌట్



**రాజస్థాన్ రాయల్స్ చేతిలో లక్నో సూపర్ జెయింట్స్ తన సొంత మైదానంలో ఓటమి చవిచూసింది. ఐపీఎల్ 2026లో భాగంగా లక్నోలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఏక్నా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 40 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేయగా, 160 పరుగుల లక్ష్యంతో క్రీజులోకి దిగిన లక్నో 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది.**

లక్నో చివరలో 15 పరుగుల తేడాలో ఐదు వికెట్లను కోల్పోయింది. లక్నో సూపర్ జెయింట్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 159 పరుగులు చేసింది. చివరి ఓవర్‌లో లక్నో బౌలర్ మయాంక్ అగర్వాల్ ఏకంగా 20 పరుగులు ఇచ్చాడు. దీనితో రాజస్థాన్ స్కోర్ 150 దాటింది. ప్రారంభంలో దూకుడు మీదున్న జైశ్వాల్‌ను మహమ్మద్ షమీ పెవిలియన్‌కు పంపించాడు. మూడో ఓవర్ వేసిన షమీ వరుస బంతుల్లో జైశ్వాల్, ధ్రువ్ జురెల్‌లను ఔట్ చేశాడు. దీంతో రాజస్థాన్ ఆట నెమ్మదించింది.



షమీ, ప్రిన్స్ యాదవ్, మోహ్సిన్ ఖాన్ తలా రెండు వికెట్లు తీశారు. రాజస్థాన్ ఆటగాళ్లలో రవీంద్ర జడేజా (43), జైస్వాల్ (22), హెట్మెయర్ (22) శివమ్ దుబే (19) పరుగులు చేశారు. ఆ తర్వాత ఛేదన ప్రారంభించిన లక్నో మొదటి రెండు ఓవర్లలోనే కీలక రెండు వికెట్లను కోల్పోయింది. నాంద్రే బర్గర్ బౌలింగ్‌లో రిషబ్ పంత్ డకౌట్‌గా వెనుదిరిగాడు. లక్నో ఆటగాళ్లలో మిచెల్ మార్ష్ 41 బంతుల్లో 55 పరుగులు చేసి రాణించాడు. మిగిలిన వారు ఎవరూ ఉత్తమ ప్రదర్శన కనబరచలేదు. జోఫ్రా ఆర్చర్ 3, బ్రిజేష్ శర్మ, నాంద్రే బర్గర్ రెండేసి వికెట్ల చొప్పున తీసుకున్నారు. పంజాబ్ కింగ్స్ ఆరు మ్యాచ్‌లకు గాను ఐదింట గెలిచి 11 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఇప్పటి వరకు 4 పాయింట్లతో బెంగళూరు, హైదరాబాద్, రాజస్థాన్ రెండు, మూడు, నాలుగో స్థానాల్లో ఉన్నాయి. లక్నోపై విజయం సాధించడంతో మొత్తం పది పాయింట్లు సాధించిన రాజస్థాన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది.

## గుజరాత్ విద్యామంత్రికి అవార్డు అంకితం: జడేజా

రవీంద్ర జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాజస్థాన్ రాయల్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే ఈ మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనను తన సతీమణి, గుజరాత్ విద్యాశాఖ మంత్రి రివాబా జడేజాకు అంకితమిస్తున్నట్లు



రవీంద్ర జడేజా తెలిపాడు. ఈ రోజు తాను మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేస్తానని ఆమె ఒక రోజు ముందు చెప్పిందని గుర్తు చేసుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ది అవార్డు స్వీకరించిన అనంతరం మాట్లాడిన రవీంద్ర జడేజా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. నేను మాట్లాడే ముందు ఈ అవార్డును గుజరాత్ విద్యాశాఖ మంత్రికి అంకితం చేయాలనుకుంటున్నాను. ఎందుకంటే రేపటి మ్యాచ్‌లో నువ్వు అద్భుతాలు చేస్తావని ఆమె నిన్ననే నాతో చెప్పారు. ఆమెకు నా కృతజ్ఞతలు. ఈ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా లేదు. బంతి సీమ్‌తో పాటు స్వింగ్ అయ్యింది. దాంతో నేను వీలైనంత ఎక్కువ సేపు క్రీజులో ఉండాలని అనుకున్నాను. నా తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన డొనోవన్, ఇతర ఆటగాళ్లతో కూడా ఇదే చెప్పాను. టీ20 క్రికెట్‌లో ఏదైనా జరగొచ్చు కాబట్టి చివరి వరకు ఆడాలని గట్టిగా అనుకున్నాం. చివరి ఓవర్‌లో మేం 20కి పైగా పరుగులు రాబట్టగలిగాం. మా ఆలోచన కూడా అదే. మయాంక్ యాదవ్ గాయం నుంచి కోలుకొని వచ్చి ఆ వేగంతో బౌలింగ్ చేయడం అంత సులువు కాదు. కానీ నేను నా బలాన్ని నమ్మాను. ఒకరికొకరు సహకరించుకుంటూ మంచి క్రికెటింగ్ షాట్లు ఆడదామని నా పార్ట్‌నర్‌తో చెప్పాను. ఎందుకంటే ఈ వికెట్‌పై బంతి బాగా సీమ్ అవుతోంది. బౌన్స్ కూడా ఉంది. కాబట్టి ఏ సమయంలో పడితే ఆ సమయంలో ఏ షాట్ పడితే అది ఆడటం కష్టం. పూరన్ నా జేబులో ఉన్నాడు(నవ్వుతూ). పూరన్‌ను ఔట్ చేసిన తర్వాత అప్పటికప్పుడు అలా సెలెబ్రేట్ చేయాలనిపించి చేశాను. అంతకుమించి ఏం లేదు. వికెట్‌పై బంతి కొంచెం గ్రిప్ అయ్యింది. అందుకే వేగంగా బౌలింగ్ చేయాలా లేక నెమ్మదిగా వేయాలా అని ఆలోచించాను. స్లో బాల్స్ వేసినప్పుడు సహకారం లభిస్తుందని గ్రహించాను. ఆ బాల్సే కొనసాగించాను. మిడ్ వికెట్, లాంగ్-ఆన్ సైడ్ బౌండరీలు ఇతర వైపుల కంటే కొంచెం చిన్నవిగా ఉన్నాయి. అతను ఏదో ఒక దశలో ఆ షాట్ ఆడతాడని నాకు తెలుసు. అందుకే నా పేస్‌ను మారుస్తూ నెమ్మదిగా, వైడ్, ఫుల్ లెంగ్త్ బంతులను కలిపి వేశాను. ఏది ఏమైనా ఈరోజు నేను నెమ్మదిగా బౌలింగ్ చేయాలని నిశ్చయించుకున్నాను. ఆ వ్యూహం ఫలించింది.'అని జడేజా తెలిపాడు.

## నా వల్లే ఈ ఓటమి: పంత్



చెత్త బ్యాటింగే తమ ఓటమికి ప్రధాన కారణమని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ అన్నాడు. తనతో పాటు బ్యాటర్లంతా విఫలమయ్యారని తెలిపాడు. బౌలర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చినా.. చెత్త బ్యాటింగ్‌తో గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమిపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన రిషభ్ పంత్.. ఈ ఓటమి గురించి మాట్లాడటం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. 'ఈ ఓటమి గురించి మాట్లాడటం కష్టంగా ఉంది. కచ్చితంగా మా చెత్త బ్యాటింగే ఓటమికి ప్రధాన కారణం. ఈ ఓటమి పట్ల జట్టుగా తీవ్ర అసంతృప్తితో ఉన్నాం. అయితే మేం పుంజుకోవడానికి మార్గాలను వెతుక్కోవాలి. జట్టు లోపాలే పరిష్కారాలు కనుగొనాలి. ప్రస్తుతం మా పరిస్థితి బాలేదు. బ్యాటింగ్ సమయంలో మేం కాస్త టైమ్ తీసుకొని ఆడాల్సింది. ఈ ఓటమికి నేను ఏ సాకు చెప్పదలచుకోలేదు. నాతో సహా మేమంతా ఆ తప్పు చేశాం. మ్యాచ్‌ను ఇంకాస్త చివరి వరకు తీసుకెళ్లాల్సింది. ఎందుకంటే మా బౌలర్లు ఈ రోజు అద్భుతంగా రాణించారు. బ్యాటింగ్ విభాగం బాధ్యత తీసుకొని బౌలర్ల కోసం ఈ మ్యాచ్ గెలవాల్సింది. జట్టుగా ఈ ఓటమి మాకు నిరాశ కలిగిస్తుంది. కానీ మేం ఇంకా సానుకూల అంశాల వైపే చూడాలనుకుంటున్నాం. మా బలహీనతలను సరిదిద్దుకోవాలి. మా బౌలింగ్, బ్యాటింగ్‌లో ఫైర్ పవర్ ఉంది. మేం కచ్చితంగా పుంజుకుంటామని నమ్మకం నాకుంది.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు.

## ఇషాన్‌పై వేటు?



ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ వరుస విజయాలతో దూసుకు వెళ్తోంది. ఇషాన్ కిషన్ కెప్టెన్సీలో అదరగొడుతోంది హైదరాబాద్. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో కూడా మూడో స్థానంలో ఉంది. అయితే గాయం నుంచి కోలుకున్న కమిన్స్, తిరిగి జట్టులో చేరబోతున్నాడు. ఈ నెల 25వ తేదీన హైదరాబాద్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ సందర్భంగా కమిన్స్ రీ-ఎంట్రీ ఇస్తాడు. ఇలాంటి నేపథ్యంలో ఇషాన్ కిషన్ ను కెప్టెన్సీ నుంచి తప్పిస్తారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. కావ్య మారన్ కూడా కమిన్స్ కే సారాధ్య బాధ్యతలు ఇస్తుందని కూడా చర్చ జరుగుతోంది. అయితే ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇషాన్ కిషన్ కెప్టెన్సీలో జా=ం అద్భుతంగా రాణిస్తోందని వెల్లడించారు. ఇలాంటి నేపథ్యంలో కెప్టెన్సీ మార్పు చేస్తే, జట్టు లయ కోల్పోతుందని యాజమాన్యానికి సూచనలు చేశారు.



## ఓపికే నా సీక్రెట్: అభిషేక్

ఢిల్లీ క్యాపిటల్స్‌పై 135 పరుగులతో అజేయంగా నిలిచి సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) విజయంలో కీలక పాత్ర పోషించిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మ, తన విధ్వంసకర ఇన్నింగ్స్ వెనుక ఉన్న ప్రణాళికను వెల్లడించాడు. ఇది కేవలం బాదుడు మాత్రమే కాదని... ఓపిక, గేమ్ అవగాహన, సరైన మ్యాచ్‌అప్‌లను లక్ష్యంగా చేసుకుని ఆడిన వ్యూహాత్మక ఇన్నింగ్స్ అని స్పష్టం చేశాడు. అభిషేక్ శర్మ అద్భుత శతకం సాయంతో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం బౌలింగ్‌లోనూ అద్భుతంగా రాణించి, వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్ అనంతరం అభిషేక్ శర్మ మాట్లాడుతూ... "ఈ ఇన్నింగ్స్ కోసం చాలా కాలంగా సన్నద్ధమవుతున్నాను. టాప్-3 బ్యాటర్లలో ఒకరు చివరి వరకు క్రీజులో ఉండాలనేది మా ప్రణాళిక. ముఖ్యంగా నేను రెండో స్ట్రాటజిక్ టైమ్‌అవుట్ వరకు ఆడాలని మా బ్యాటింగ్ కోచ్ ఫ్రాంకీతో చర్చించాను. చాలాకాలంగా అది సాధ్యం కాలేదు. కానీ, ఈసారి ఎలాగైనా సాధించాలని అనుకున్నా" అని వివరించాడు. గేమ్ ప్లాన్‌ను మరింత వివరిస్తూ... "పిచ్‌పై ప్రతీ బంతిని బలంగా బాదడం కష్టమని నాకు అర్థమైంది. అందుకే సరైన మ్యాచ్‌అప్‌ల కోసం ఓపికగా ఎదురుచూశాను. మొదటి స్ట్రాటజిక్ టైమ్‌అవుట్ సమయంలో కోచ్ వచ్చినప్పుడు కూడా ఇదే ప్రణాళికను కొనసాగించాలని నిర్ణయించుకున్నాం. నా వ్యూహం ఫలించింది" అని తెలిపాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో స్పిన్నర్లను ఎదుర్కోవడంపై తన వ్యూహాన్ని స్పష్టం చేశాడు. "పవర్‌ప్లేలో స్పిన్నర్లు బౌలింగ్‌కు వస్తే, వారిపై ఆధిపత్యం చెలాయించి ఒత్తిడి పెంచడమే నా ప్లాన్. అది బంతి స్పిన్ అయినా, ఆగినా నా ప్రణాళిక మారదు" అని అన్నాడు. భాగస్వామ్యాల గురించి మాట్లాడుతూ... "నాతో పాటు ఎవరు బ్యాటింగ్ చేస్తున్నా, ఓవర్ తొలి రెండు, మూడు బంతుల్లో బౌండరీ వస్తే ఆ ఓవర్‌ను భారీగా మలచడానికి ప్రయత్నిస్తాం. ఇది ప్రత్యర్థి బౌలర్‌పై ఒత్తిడిని పెంచుతుంది" అని తన ఆలోచనా విధానాన్ని పంచుకున్నాడు.

## ఐసీసీ పదవికి వాసిమ్ ఖాన్ గుడ్‌బై

ఐసీసీ జనరల్ మేనేజర్ గా గత నాలుగేళ్లుగా సేవలందిస్తున్న వాసిమ్ ఖాన్, తాజాగా తన పదవి నుంచి తప్పుకున్నారు. 2022లో జెఫ్ అల్లార్డైస్ నుంచి ఈ బాధ్యతలను స్వీకరించిన ఆయన, తన పదవీ కాలం ముగియకుండానే వైదొలగడం గమనార్హం. వాసిమ్ ఖాన్ ఇంగ్లాండ్‌లో జన్మించి అక్కడే కౌంటీ క్రికెట్ ఆడారు. పాకిస్థాన్ తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినప్పటికీ, ఆయనకున్న అడ్మినిస్ట్రేటివ్ నైపుణ్యంతో 2019 నుండి మూడేళ్ల పాటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సీఈవోగా పనిచేశారు. గత రెండేళ్లుగా ఐసీసీలో ఉన్నత స్థాయి అధికారులు వరుసగా వైదొలుగుతున్నారు. ఇప్పటికే క్రిస్ టెట్లీ, అలెక్స్ మార్షల్ వంటి వారు తప్పుకోగా, ఇప్పుడు వాసిమ్ ఖాన్ కూడా ఆ జాబితాలో చేరారు. వీరి స్థానాల్లో గౌరవ్ సక్సేనా, ఆంఢ్రూ వంటి వారు కొత్త బాధ్యతలు చేపట్టారు.

## హార్దిక్‌తో గొడవల్లేవ్: కృనాల్ పాండ్యా

టీమిండియా ఆల్‌రౌండర్లు, సోదరులైన కృనాల్ పాండ్యా, హార్దిక్ పాండ్యా మధ్య సత్సంబంధాలు లేవంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఐపీఎల్ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున కృనాల్, ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హార్దిక్ తలపడిన తర్వాత ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. ఈ నేపథ్యంలో తన తమ్ముడితో ఉన్న విభేదాల వార్తలపై కృనాల్ పాండ్యా ఎట్టకేలకు స్పందించాడు. అవన్నీ నిరాధారమైన పుకార్లని కొట్టిపారేశాడు. ఇటీవల ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ డానిశ్ సైత్‌తో కృనాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా డానిశ్ సరదాగా.. "మీకు, హార్దిక్‌కు మధ్య అంతా ఓకేనా? లేక ఏమైనా గొడవలు ఉన్నాయా?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కృనాల్ నవ్వుతూ సమాధానమిచ్చాడు. డానిశ్ జోక్యం చేసుకుని, "కొన్నిసార్లు కేన్, అండర్‌టేకర్ కూడా గొడవపడతారు" అని వ్యాఖ్యానించగా, మరోసారి "అంతా ఓకేనా?" అని అడిగారు. దీనికి కృనాల్ పాండ్యా.. "అంతా ఓకే" అని స్పష్టంగా బదులిచ్చాడు. దీంతో పాండ్యా బ్రదర్స్ మధ్య గొడవలున్నాయనే ప్రచారానికి తెరపడినట్లయింది. ఇదే ఇంటర్వ్యూలో లక్నో సూపర్ జెయింట్స్ యువ ఆటగాడు ముకుల్ చౌదరిని తాను స్లెడ్జింగ్ చేశాననే ఆరోపణలపైనా కృనాల్ వివరణ ఇచ్చాడు. "నేను అతడిని స్లెడ్జింగ్ చేయలేదు. మొదటి బంతికే ప్యాడిల్ షాట్ ఆడాడు. నేను కేవలం, 'ముకుల్ నువ్వు యువ ఆటగాడివి. లాంగ్-ఆన్ లేదా లాంగ్-ఆఫ్ మీదుగా సిక్సర్లు కొట్టగలవు. అక్కడ కొట్టు' అని సరదాగా అన్నాను.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
గురువారం 23-4-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

## కృత్రిమ మేధ.. సరికొత్త ఉపాధి విప్లవం!

నేటి ఆధునిక యుగంలో సాంకేతిక విప్లవం మునుపెన్నడూ లేనంత వేగంతో దూసుకుపోతోంది. ముఖ్యంగా భారత్‌లో కృత్రిమ మేధ వినియోగం అసాధారణ రీతిలో పెరుగుతోంది. నాస్కామ్, ఇతర పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం, 2026 నాటికి దాదాపు 87% భారతీయ సంస్థలు తమ కార్యకలాపాల్లో ఏఐని అంతర్భాగం చేసుకోనున్నాయి. ఈ పరిణామం శ్రామిక వర్గంలో ఒకవైపు ఆందోళనను, మరోవైపు ఆశలను రేకెత్తిస్తోంది. ఏఐ వల్ల పునరావృతమయ్యే పనులు, డేటా ఎంట్రీ, ప్రాథమిక కస్టమర్ సర్వీస్ వంటి విభాగాల్లో ఉద్యోగాల కోత తప్పదనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఏఐ 'గాడ్‌ఫాదర్' జెఫ్రీ హింటన్ వంటి నిపుణులు సైతం 2026 ప్రారంభం నాటికి నిరుద్యోగిత పెరిగే ప్రమాదం ఉందని అప్రమత్తం చేశారు. ఇప్పటికే ఐటీ సర్వీసెస్ రంగంలో నియామకాలు కొంత మందగించడం, ఉత్పాదకతను పెంచుకుంటూ తక్కువ మందితో ఎక్కువ పని చేయించుకునే ధోరణి పెరగడం గమనార్హం. అయితే, ఏఐ అనేది కేవలం ఉద్యోగాలను తొలగించే సాధనం మాత్రమే కాదు, అది ఒక 'సూపర్ పవర్' వంటిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఏఐ వల్ల ఉద్యోగాలు పోవు కానీ, పని చేసే విధానం మారుతుంది. నైపుణ్యాలను మెరుగుపరుచు కోని వారు మాత్రమే వెనుకబడిపోతారు. మూడు దశాబ్దాల క్రితం కంప్యూటర్ల రాకతో ఎదురైన ఆందోళనలే నేడు ఏఐ విషయం లోనూ వ్యక్తమవుతున్నాయి, కానీ చరిత్ర చూస్తే సాంకేతికత ఎప్పుడూ కొత్త అవకాశాలనే సృష్టించింది. 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా 1.15 కోట్ల కొత్త డేటా సైన్స్ ఉద్యోగాలు వస్తాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం పేర్కొంది. కేవలం భారత్‌లోనే వచ్చే ఐదేళ్లలో 1.1 కోట్లకు పైగా డేటా సైన్స్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని అంచనా. ఈ రంగంలో నైపుణ్యం ఉన్నవారికి వార్షిక వేతనం ప్రారంభంలో రూ.6–8 లక్షల నుండి మొదలై, అనుభవం పెరిగే కొద్దీ రూ.25 లక్షల పైచిలుకు లభిస్తోంది. భారతదేశం ప్రస్తుతం "ఏఐ శతాబ్దం" వైపు అడుగులు వేస్తోంది. ఏఐని కేవలం ఒక సవాలుగా కాకుండా, ఉత్పాదకతను పెంచే సాధనంగా గుర్తించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మన విద్యావ్యవస్థను, వృత్తి నైపుణ్యాలను ఏఐకి అనుగుణంగా మలుచుకుంటేనే, ఈ సాంకేతిక విప్లవం అధిక వేతనాలతో కూడిన ఉపాధికి రాజమార్గం అవుతుంది.

# రాజ్యాంగమే గెలిచింది

రాజకీయ ప్రయోజనాలకోసం కాదేది అనర్హం రాజ్యాంగ సవరణలు సైతం అన్న విధంగా కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించె రకంగా మహిళలకు 33% రిజర్వేషన్ చట్టసభలలో అమలుపరచాలనే నెపంతో మూడు బిల్లులను ముడివేసి డీలిమిటేషన్ అమలు చేయాలనె ప్రధాన లక్ష్యంగా 131 వ రాజ్యాంగ సవరణ బిల్లు2026తో పాటు కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లు 2026, డీలిమిటేషన్ బిల్లు 2026 ఈ యొక్క మూడు బిల్లులను పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏప్రిల్ 16 నుంచి 19వ తేది వరకు ఏర్పాటు చేసి లోక్ సభలో ప్రవేశపెట్టడం జరిగింది.లోక్ సభలో బిల్లును ప్రవేశపెట్టిన సమయంలో మొత్తం సభ్యుల సంఖ్య 528 గురు ఓటింగ్ లో పాల్గొన్నారు, బిల్లుకు మద్దతుగా 298 సభ్యులు ఓటు వేశారు, బిల్లుకు వ్యతిరేకంగా 230 సభ్యులు ఓటు వేశారు, బిల్లు 2/3 మెజార్టీతో ఆమోదం పొందడానికి 352 సభ్యుల ఓట్లు అవసరం బిల్లు ఆమోదం పొందడానికి ఇంకా 54 సభ్యుల ఓట్ల తేడాతో బిల్లు వీగిపోయింది. 131 వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్ సభలో ఆమోదింప చేసే రాజకీయ చదరంగంలో కేంద్ర ప్రభుత్వం విఫలమై ఓడిపోయిందని, ప్రతిపక్షాలు బిల్లును ఓడించాయని అనడం కన్నా రాజ్యాంగంలోని 368 ప్రకరణ ప్రకారం రాజ్యాంగ సవరణకు 2/3 మెజారిటీని నిర్దేశించిన భారత రాజ్యాంగం గెలిచిందనడం సమంజసమైనదిగా మరియు ప్రజాస్వామ్యం బ్రతికిందని, ప్రతిపక్షాల ఐక్యత బలపడిందని చెప్పవచ్చు. 131 వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్షాలు ముక్తకంఠంతో వ్యతిరేకించడానికి భలమైన కారణాలు లేకపోలేదు.






అక్కల బాబు గౌడ్

## వీగిన 131 వ రాజ్యాంగ సవరణ

### ప్రతిపక్షాల వ్యతిరేకత ఎందుకంటే..

1) మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్ బిల్లుతో ముడి పెట్టడం. డీలిమిటేషన్ బిల్లు అనేక అనుమానాలకు, ఆందోళనలకు, రాజకీయ ప్రాతినిధ్య మనుగడ అభద్రతతో కూడుకొని సంక్లిష్టమైనదిగా ప్రతిపక్షాలు భావించి ఐక్యంగా బిల్లును ఓడించారు.

2). ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ప్రచార హోరులో నిమగ్నమైన ప్రతిపక్షాలకు ఊపిరి సలుపలేని సమయంలో మూడు రోజులపాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి 131 వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం ప్రతిపక్షాలకు రాజకీయ పరీక్షను పెట్టిన విధంగా ప్రతిపక్షాలు భావించి జీర్ణించుకోలేకపోతున్నారు.

3) 2024 లోక్ సభ ఎన్నికల ఓటు బ్యాంకు కోసం ఆగమేఘాల మీద మహిళా రిజర్వేషన్ బిల్లు రూపొందించి 2023 సెప్టెంబర్ లో పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది రాష్ట్రపతి అనుమతి ముద్ర కూడా వేయబడింది, ఇట్టి బిల్లును2026-27 సంవత్సరంలో జనగణనను పూర్తి చేసి 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని చట్టబద్ధంగా నిర్ణయించిన ప్రకారం ముందుకు వెళ్లకుండా అట్టి బిల్లును మళ్లీ తిరిగి డీలిమిటేషన్ బిల్లుతో ముడిపెట్టి లోక్‌సభలో ప్రవేశ పెట్టడం ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించారు.

కేంద్ర ప్రభుత్వం రాజకీయ వ్యూహంలో భాగంగా 2023 లోనే ఆమోదం పొందిన మహిళా బిల్లును మళ్ళీ తిరిగి లోక్‌సభలో ప్రవేశపెట్టి బిల్లు వీగిపోతే ప్రతిపక్షాలను మహిళా వ్యతిరేకులుగా ముద్రవేసి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో మహిళా ఓటు బ్యాంకు పొందే రాజకీయ ఎత్తుగడ బెడిసి కొట్టింది. ప్రజలు సైతం రాజ్యాంగ సవరణ లక్ష్యం ఏమిటో అర్థం చేసుకోగలిగారు. 4) 543 లోక్‌సభ స్థానాలను, రాష్ట్రాల శాసనసభ స్థానాలను స్థిరీకరించి 50 ఏళ్లు గడిచిపోతున్న సమయంలో, చట్టసభల స్థానాల పెంపు పునర్వ్యవస్థీకరణ బిల్లు అత్యంత ప్రాధాన్యమైనటువంటిది. ఇటువంటి బిల్లు రూపొందించే ముందు ప్రతిపక్ష పార్టీలతో రాష్ట్ర ప్రభుత్వాలతో, పౌర సంఘాలతో, సమగ్రమైన చర్చా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిపక్ష పార్టీలతో సమన్వయాన్ని సాధించి ఆమోదయోగ్యమైన బిల్లును రూపొందించాల్సి వుండే కానీ బిల్లును ఏకపక్షంగా రూపొందించి అమలు చేయడాన్ని ప్రతిపక్షాలు, ప్రజలు, విద్యావంతులు తీవ్రంగా వ్యతిరేకించారు.

### 50 ఏళ్లుగా ఇదే తంతు

ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరిగే జనాభా గణన తర్వాత ఆయా రాష్ట్రాలలో జనాభాకు అనుగుణంగా లోక్‌సభ సీట్లను మరియు రాష్ట్ర శాసనసభ స్థానాలనుపెంపు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను డీలిమిటేషన్ అంటారు.ఇట్టి డీలిమిటేషన్ ప్రక్రియ రాజ్యాంగంలోని ఆర్టికల్ 82, 170 ప్రకారం నిర్వహించబడుతుంది. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఏడు సార్లు జనాభా గణన జరిగింది. కానీ ఈ ఏడు జనాభా గణనల తర్వాత డీలిమిటేషన్ ప్రక్రియ కొనసాగలేదు కేవలం నాలుగు సార్లు మాత్రమే డీలిమిటేషన్ ప్రక్రియ 1951, 1961, 1971, 2001 వరకు చేపట్టడం జరిగింది, ఈ నాలుగు సార్లు జరిగిన జనగణలో కేవలం మూడుసార్లు మాత్రమే లోక్‌సభ మరియు శాసనసభ స్థానాలను పెంచడం జరిగింది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా గణన ఆధారంగా చివరిగా పెంచబడినవి. ఆ తర్వాత జరిగిన జనాభా గణనల అనంతరం డీలిమిటేషన్ కొనసాగించలేదు ఆ తర్వాత దేశంలో కుటుంబ నియంత్రణ పథకాన్ని ప్రవేశపెట్టారు. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పథకాన్ని పకడ్బందీగా అమలుపరచి జనాభా పెరుగుదలను నియంత్రించగలిగారు, ఉత్తరాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పథకాన్ని అంతగా పాటించలేదు, ఫలితంగా ఉత్తరాదిరాష్ట్రాల్లో జనాభా పెరుగుదల యధావిధిగా కొనసాగింది. ఒకసారి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే రిపోర్టును 2019 -21ను అనుసరించి ఉత్తరాది రాష్ట్రాల ఫర్టిలిటీ రేట్ దక్షిణాది రాష్ట్రాల పర్టిలిటీ రేటును పరిశీలిస్తే ఎంతటి తారతమ్యం ఉందో మనకు అర్థమవుతుంది, బీహార్, 3.0, మేఘాలయ2.9, ఉత్తరప్రదేశ్ 2.4, ఝార్ఖండ్ 2.3 మధ్యప్రదేశ్ 2.0 ఉండగా, దక్షిణాది రాష్ట్రాల ఫెర్టిలిటీ రేట్ 1.5 నుంచి 1.8 మధ్యలో ఉన్నది, కావున కుటుంబ నియంత్రణ అమలు ఫలితంగా ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలలో జనాభా పెరుగుదల అసమతుల్యత ఏర్పడినందున, ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఇందిరా గాంధీ ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియను నిలుపుదల చేయడానికి 1976 లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లోక్ సభ, రాష్ట్ర శాసనసభలోని మొత్తం సీట్ల సంఖ్యను 1971 జనాభా గణన ఆధారంగా స్తంభింప చేశారు. ఈ నిలుపుదల 2000 సంవత్సరం తర్వాత మొదటి జనాభా గణన 2001 వరకు నియోజకవర్గాల పునర్విభజనను 25 సంవత్సరాల పాటు వాయిదా వేయడం జరిగింది. ఆతరువాత 2001లో మళ్లీ 84 వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని రూపొందించి డీలిమిటేషన్లో నియోజకవర్గాల సంఖ్యను పెంచకుండా 1971 జనాభా గణన ఆధారంగా పెంచిన లోక్ సభ స్థానాల సంఖ్యను 543 యధావిధిగా స్థిరీకరించి కొనసాగిస్తూ, మళ్ళీ నిలుపుదలను మరో 25 సంవత్సరాల పాటు 2026 తరువాత జరిగే మొదటి జనాభా గణన వరకు పొడిగించబడింది, ఈ యొక్క రాజ్యాంగ సవరణ 2022 ఫిబ్రవరిలో ఆమోదింపబడి అమల్లోకి వచ్చింది.

### 2026 జనాభా గణననే ప్రామాణికం

2026 జనగణనతో పాటు దేశవ్యాప్తంగా అన్ని కులాల జనాభాను లెక్కించి డిలిమిటేషన్ ప్రక్రియను ప్రారంభించాలి తద్వారా మహిళా రిజర్వేషన్ 33%న్ని ఓబీసీ మహిళా కోటా తో 2029 పార్లమెంటు ఎన్నికలలో అమలు పరచాలి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 2001లో చేసిన 84వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం 2026 తర్వాత వచ్చే జనాభా గణన ఆధారంగానే డీలిమిటేషన్ చేయాలి, కానీ మళ్ళీ ఇప్పుడు 2011 జనాభా గణన ఆధారంగా డిలిమిటేషన్ ప్రక్రియను చేస్తూ లోక్ సభ స్థానాలను గరిష్టంగా 850 వరకు పెంచి రాష్ట్రాల జనాభా ఆధారంగా నియోజకవర్గాల సంఖ్యను నిర్ధారిస్తామని బిల్లులో పొందుపరిచిన విధంగా చూస్తే 2011 డిలిమిటేషన్ ద్వారా 850 లోక్ సభ స్థానాలను రాష్ట్రాల మధ్య పంపిణీ చేసినట్లయితే దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న సభ్యుల సంఖ్య 24.3% నుంచి 20.7 శాతానికి తగ్గిపోతుంది అదేవిధంగా ఉత్తరాది రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న సభ్యుల సంఖ్య 38.1 శాతం నుంచి 43.1 శాతానికి పెరుగుతుంది అదేవిధంగా ఈశాన్య రాష్ట్రాల యొక్క ప్రాతినిధ్యం కూడా 4.4%నుంచి 3.8% నికి తగ్గిపోతుంది. మరొక విదంగా అన్ని రాష్ట్రాలకు 50%చొప్పున ఏకరీతిన పెంచుతామని మరో ప్రతిపాదన చేయడాన్ని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకం చేస్తున్నాయి ఈ రెండు పద్ధతులను అనుసరించి డిలిమిటేషన్ ప్రక్రియ ఏ విధంగా చేసినా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని జనాభా పెరుగుదల గణంకాలే సూచిస్తున్నవి. ప్రస్తుతం ఏ రాష్ట్రానికి డీలిమిటేషన్ తో అన్యాయం జరగకూడదు అనుకుంటే డీలిమిటేషన్ ప్రక్రియను శ్రీమతి ఇందిరా గాంధీ మాదిరి మరియు అటల్ బిహారీ వాజ్ పేయ్ మాదిరి మరో 25 సంవత్సరాలకు పొడిగించాలి. లేదా జనాభా నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు, నష్టం జరుగకుండా వారి ఆమోదంతో సూచించిన మరో కొత్త పద్ధతిని అనుసరించాలి

### 3 దశాబ్దాలుగా మహిళలకు ఎందుకీ సమస్య?

బీసీ మహిళలకు, ముస్లిం మహిళలకు కోటాలేని మహిళా రిజర్వేషన్ 33% బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారే కానీ చట్టసభలలో అన్ని వర్గాల మహిళల ప్రాతినిధ్యానికి వ్యతిరేకం కాదని అర్థం చేసుకోవాలి, ఆ లక్ష్యం కోసమే పోరాటం చేసినవారు, చేస్తున్న వారు మొదటి నుంచి ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్, శరత్ యాదవ్, కరుణానిధి నుంచి ఇప్పటి అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్ స్టాలిన్, మమతాబెనర్జి, బహన్ మాయావతి గారు అన్ని వర్గాల మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కావాలని పోరాటం చేస్తున్నారు. అదేవిధంగా 2026లో చేస్తున్న జనగణలలో భాగంగా కులగణనను చేయాలని కూడా ఈనాటి బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేయుచున్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ దేశ భవిష్యత్తుకు అత్యంత ప్రధానమైనది కావున దేశ సమగ్రతను ప్రజాస్వామ్య పటిష్టతను రాజకీయ ఐక్యతను కేంద్ర ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని, నియంతృత్వ, ఏకపక్ష విధానాలకు స్వస్తి పలికి ప్రతిపక్ష పార్టీల సమన్వయంతో సామరస్యంగా ఆమోదయోగ్యంగా చట్టబద్ధమైన చర్యలకు పూనుకొని దేశ అభివృద్ధికి అన్ని రాజకీయపక్షాలు సమైక్యంగా తోడ్పడాలి.

-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సమాజ్‌వాదీ పార్టీ
బీసీ చైతన్య వేదిక, బీసీ కులాల ఐక్యవేదిక
రాష్ట్ర సలహాదారు

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.